RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 14 సెప్టెంబర్ 2025 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:89

# నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్, CWC మాజీ చైర్మన్ కె, వోహ్రా( Vohra), నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఉన్నతాధికారులు.**

**ఢిల్లీలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో బలమైన వాదనలు వినిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ.**





కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణాలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునేది లేదని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై శనివారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

సీఎంతో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్?కుమార్? రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ. ఎన్.సి అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రెటరీ మాణిక్‌రాజ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలని కోరారు.

ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంటన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్‌కు అందించాలని చెప్పారు.

గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకీ 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో వ్యవహరించటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్?లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు.

దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్? ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు.

శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్? ఎదుట వాదనలుగా వినిపించాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించు కోలేకపో యిందని గుర్తు చేయాలన్నారు.

తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది – మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి





**నల్గొండ ప్రజాబలం ప్రతినిధి**పురుషులతో పాటు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.శనివారం నాడు నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ కాలనీ సమీపంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి పెట్రోల్ పంపు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకొస్తున్నారని, తాను 2004 సంవత్సరంలో శాసనసభ్యులుగా ఉన్న సమయంలో ఒక్కో గ్రామంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు 15 కోట్ల వరకు రుణాలు ఇప్పించడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అన్ని పథకాల లబ్ధిని మహిళలకి ఇస్తున్నదని, ముఖ్యంగా ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం వంటివి ఉదాహరణగా చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు కలిసికట్టుగా పని చేసుకోవాలని కోరారు. ఎస్ఎల్బీసీ వద్ద ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ భవిష్యత్తులో బాగా నడుస్తుందని, మెడికల్ కళాశాల పక్కనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల, ఇటు హైదరాబాద్ రహదారికి ,నాగార్జునసాగర్ రహదారికి చేరువలో ఉండటం, పెట్రోల్ పంపు తో పాటు, ఏవి చార్జింగ్ మిషన్, కేఫ్ టేరియా,సూపర్ మార్కెట్ వంటివి ఇక్కడ బాగా నడుస్తాయని అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ ఆస్పత్రికి మంచి వైద్య సేవలు అందిస్తున్నదని, ఇటీవలే ఏ ఐ జి ఆసుపత్రి ప్రభుత్వ వైద్య కళాశాల తో పాటు, జిజిహెచ్ ను దత్తత తీసుకున్నదని, కనగల్ లో పి హెచ్ డి లో గ్లూకోమా సెంటర్ ఏర్పాటు చేశామని, మహిళల ద్వారా కట్టంగూరు మండలం అయిటిపాములలో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మహిళలు బాగా పనిచేస్తే ఆర్థికంగా పురుషులతో పాటు, సమానంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

సెర్ప్ సి ఈ ఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయ సంఘాలకు 20వేల కోట్ల రూపాయల రుణాలు ఇస్తున్నామని, చిన్న సంఘాల ద్వారానే మహిళల్లో ధైర్యం వస్తుందని, ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే మహిళ ముందడుగు వేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక మహిళా సంఘాలలోని సభ్యులకు ప్రతి ఇంటికి రుణం వెళ్లే విధంగా చూడాలని అన్నారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళలకు అప్పగించగా, రాష్ట్రవ్యాప్తంగా 30 కోట్ల ఆదాయం వస్తే నల్గొండ జిల్లాలో కోటీ 40 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలులో సైతం 80 కోట్ల రూపాయల ఆదాయాన్ని స్వయం సహాయక మహిళా సంఘాలు రాష్ట్రంలో ఆదాయం అర్జించారని, ప్రభుత్వము మహిళల కోసం ప్రవేశపెడుతున్న పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీంతో పాటు ఆరోగ్యం, పిల్లల చదువు, పౌష్టికాహారం అందించాలని, గ్రామాలలో గృహహింసకు వ్యతిరేకంగా మహిళలకు తోడుగా నిలవాలని, ఆరోగ్యం, సామాజిక భద్రత చూసుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే మహిళలు వాణిజ్య, వ్యవసాయ రంగాలలో ముందుకు వెళ్తున్నారని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన పెట్రోల్ పంపును సక్రమంగా నిర్వహించుకోవాలని, నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపు మూడవదని, మరో మూడు పెట్రోల్ పంపులు జిల్లాకు మంజూరు అయ్యాయని తెలిపారు.

ఐఓసిఎల్ జనరల్ మేనేజర్ సుదీప్ రాయ్, డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి మాట్లాడారు.

స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపుకలెక్టర్. జె. శ్రీనివాస్, ఇన్చార్జి డిఆర్ఓ అశోక్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ ,డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి ,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ,ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి ఫిష్ ఔట్లెట్ ను ప్రారంభించారు

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం

## మంత్రులు పొన్నం, తుమ్మల

**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ లోని సర్కిల్ 19 లో 5.55 కోట్ల రూపాయలు వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు పొన్నం ప్రభాకర్ ,తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిం చారు. యూసుఫ్ గూడా డివిజన్ లోని నవోద య కాలని లో 7 పనులకు 178.35 లక్షల రూపా యల వ్యయంతో (నవోదయ కాలని ,మారుతి నగర్, కమలాపురి కాలని ,ఇంజనీర్స్ కాలని)సీసీరోడ్లకుశంకుస్థాపనచేశారు. శంకుస్థా పన చేసుకున్న సీసీ రోడ్ల పనులు వేగంగా పూర్తిచేయాలనిఅధికారులను ఆదేశించారు.

తరువాత యూసుఫ్ గూడా డివిజన్ లోని లేబర్ అడ్డా రోడ్డు లో 14 పనులకు 377.35 లక్షల రూపాయల వ్యయంతో ( ఒఔ నగర్, యూసుఫ్ గూడా బస్తీ , శ్రీ కృష్ణ నగర్ , హైలం కాలని ) సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు లేబర్ అడ్డా లో కూలీలలో జీహెచ్ ఎంసీ శానిటేషన్ సిబ్బందితో ముచ్చటించారు.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజా పాలన ప్రభుత్వంలో వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నామని నూతన రేషన్ కార్డులు ఇచ్చామని,సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వారికి తెలిపారు.. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సిఎన్ రెడ్డి, అజారుద్దీన్ , నవీన్ యాదవ్ ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యూసుఫ్ గూడా డివిజన్ లో 5.55 కోట్ల రూపాయల తో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనివార్య కారణాల వల్ల ఉప ఎన్నిక వచ్చింది..

ఇది ఉప ఎన్నికల కోసం కాదు. కృష్ణ నగర్ లో చాలా కాలంగా పెండింగ్ లో డ్రైనేజీ పనులు మొన్న శంకుస్థాపన చేసుకున్నాం ఇక నుండి వర్షం కురిసినపుడు ఇక్కడ ఇబ్బందులు ఉండవు. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచాం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో యూసుఫ్ గూడా డివిజన్ లో ఈరోజు 5.55 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం గా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేబినెట్ పనిచేస్తుంది.. మీరు మరింత మద్దతు ఇవ్వండి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 90 కోట్ల కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.. జూబ్లీహిల్స్ ఒకటే కాదు హైదరాబాద్ మొత్తం సమస్యలు పరిష్కారం చేస్తున్నాం .

మీకు ఏ పనులు కావాలన్నా అడగండి.. సంక్షన్ అయిన పనులు వేగంగా పూర్తి చేయాలి.డ్రైనేజీ,రోడ్లు ఇతర పనులు పది కాలాల పాటు మన్నిక ఉండేలా పనులు పూర్తి చేయాలి. మీ సమస్యలు స్థానిక నాయకుల దృష్టికి తీసుకురండి.. మీ సమస్యల పరిష్కారం చేసే

ప్రజాబలం

14 సెప్టెంబర్ 2025 ఆదివారం

# సుస్థిర విధానాలతోనే సాగు బాగు

భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగా పురోగమిస్తూ త్వరలోనే ప్రపంచ 3వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుండటం సంతోషకరమే. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై 50% దిగుమతి సుంకాలు విధించడం వల్ల మన జిడిపి 0.3 శాతం తగ్గనున్నట్లు, జిఎస్టి సంస్కరణలు, మార్కెట్ల విస్తరణతో ఆ నష్టాల భర్తీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల వల్ల మన ఎగుమతులపై తీవ్ర ప్రభావంపడి వేలాది మంది జీవనోపాధి కోల్పోతున్నారు. ఈ సుంకాలు అమెరికాపై కూడా ప్రభావం కలిగించగలవనే హెచ్చరికలతో తాజాగా భారత్ గొప్ప దేశమని, ప్రధాని మోడీ గొప్ప నాయకుడని ట్రంప్ మాటమార్చినా, అమెరికా సహజ మిత్రదేశమని మోడీ స్పందించినా భారీ సుంకాలపై నిర్దిష్ట ప్రకటన ఏదీ రానందున భారత్ ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషించడం అనివార్యం. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు ఎక్కువ మిగులు ఉండటాన్ని సాకుగా చూపి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. అయితే భారత్‌లో 86 % మంది చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధులపై తీవ్రప్రభావం చూపే వ్యవసాయోత్పత్తుల దిగుమతులకు అనుమతించేది లేదని భారత ప్రభుత్వం కరాఖండిగా చెబుతుండటం డాలర్ ప్రభువులకు ఆగ్రహం కలిగిస్తోంది. అమెరికాలో వేలాది ఎకరాల్లో భారీ యంత్రాలతో సేద్యం చేయడం, ప్రభుత్వం సబ్సిడీలు కూడా ఇస్తుండటం సాగు ఖర్చులు తగ్గి మిగులును భారత్, తదితర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా గట్టి ప్రయత్నాలే చేస్తోంది. 146కోట్ల జనాభాతో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌పై ఒత్తిడి తెచ్చి జన్యుపరంగా అభివృద్ధి చేసిన విత్తన రకాలను, వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసి లాభాలు దండుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. అయితే కోట్లాది మంది గ్రామీణ పేదలు, రైతుల జీవనోపాధులపై పెనుప్రభావం చూపే వ్యవసాయోత్పత్తుల దిగుమతులకు మన దేశం ఎంతమాత్రం అంగీకరించడం లేదు. అమెరికా తదితర అంతర్జాతీయ భాగస్వాములతో చర్చలు జరిపేటప్పుడు భారత ప్రజల ఆహార భద్రత, రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వాల విహిత కర్తవ్యం. గత ఆగస్టులో బ్రిటన్‌తో కుదుర్చుకున్న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంలో కూడా మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు గల అవకాశాలను అందిపుచ్చుకుంది. అయితే పాడి ఉత్పత్తులు, వంటనూనెలు, ఆపిల్స్, ఓట్స్ ఎగుమతులకు అవకాశం లభించలేదు. జపాన్, యుఎఇ, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణ కొరియా వంటి డజను దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నా వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై భారత్ దృఢ వైఖరిని అవలంబించింది. ఎలాంటి రాయితీలకు అనుమతించలేదు.

మన వ్యవసాయ రంగం నుండి 1961లో 47.6% జాతీయ ఆదాయం లభించగా, ప్రస్తుతం సేద్యపు రంగ వాటా జిడిపి 15 శాతంగా ఉన్నట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. భారత్ 1991 నుండి సరళీకృత ఆర్థిక విధానాలు అవలంబిస్తున్న నాటినుండి వ్యవసాయ రంగం జిడిపి క్రమంగా తగ్గుతూ వస్తోంది. 1991లో సేద్యం, అనుబంధ రంగాల నుండి 29.5 శాతం జిడిపి రాగా, 2001 నాటికి అది 22.3 శాతానికి, 2011లో 14.4 శాతానికి తగ్గింది. గత 15 ఏళ్లుగా సేద్యపు రంగ జిడిపి 15 శాతంగా ఉంటున్నది. అయితే దేశ శ్రామిక శక్తిలో 55% మందికి జీవనోపాధి కల్పిస్తున్నది వ్యవసాయం, అనుబంధ రంగాలే కావడం గమనార్హం. దేశ శ్రామికులు, రైతులు అందునా పల్లె ప్రజల రోజువారీ జీవితాలతో విడదీయలేని బంధంగల సేద్యం, మత్స్య, పశుపోషణ రంగాలు సహజంగానే భారత రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తొలి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నుండి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ వరకు ఎవరు ప్రధాని అయినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ రంగాల ప్రాధాన్యతను, జీవనోపాధులను గమనంలోకి తీసుకునే విధాన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. ఇటీవల భారత అమెరికా వాణిజ్య చర్చల్లో కూడా ఈ అంశాలు ప్రముఖంగా చోటుచేసుకున్నాయి. తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తులు, విత్తనాల దిగుమతికి అనుమతించాలని, సుంకాలను సరళీకరించాలని అమెరికా చేస్తున్న ఒత్తిడులకు భారత్ తలఒగ్గలేదు. కోట్లాది మంది మన అన్నదాతలు, మత్స్య, పశుపోషకుల జీవితాలను పణంగా పెట్టే విషమ షరతులకు అంగీకరించే ప్రసక్తే లేదని ప్రధాని మోడీ, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రభృతులు స్పష్టం చేయడం సరైనదే. భారత్ ఎగుమతులలో వ్యవసాయ ఉత్పత్తులకు కూడా గణనీయస్థానం ఉంది. 2013లో 314 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య ఎగుమతులు, 2024 నాటికి 437.10 మిలియన్ల డాలర్లకు పెరిగాయి. ఈ దశాబ్ద కాలంలోనే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 22.7 బిలియన్ల నుండి 48.15 బిలియన్ డాలర్లకు అంటే 112 శాతం పెరగడం విశేషం. ఈ ఏడాది మార్చి 31 వరకు వాణిజ్య ఎగుమతులు 437 బిలియన్ డాలర్లుగా పెద్దగా పెరుగుదల లేకపోయినా వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 51.9 బిలియన్ డాలర్లకు 6.4 శాతం పెరిగాయి. మన వాణిజ్య ఎగుమతులలో సేద్యపు రంగ ఉత్పత్తుల వాటా 11 శాతం. మన దేశం ప్రధానంగా బాసుమతి బియ్యం, ఇతర రకాల బియ్యాలు, సుగంధద్రవ్యాలు, చక్కెర, గొడ్డుమాంసం, నూనెలు, పండ్లు, కూరగాయలు, చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తులు ముఖ్యమైనవి.

వ్యవసాయోత్పత్తులు ఎగుమతి చేస్తున్న పది ప్రఖ్యాత దేశాలలో భారత్ కూడా ముఖ్యమైనదే. 2021లో భారత వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 2.4 శాతం కాగా, దిగుమతులు 1.7 శాతంగా ఉన్నట్లు ప్రపంచ వాణిజ్య సంస్థ వెల్లడించింది. అయితే అమెరికా వంటి అగ్రరాజ్యాలు సుంకాలను ఆయుధాలుగా ప్రయోగించి దిగుమతులను నిరోధిస్తున్నందున ఎగుమతుల విస్తరణకు వివిధ దేశాలలో గల అవకాశాలను అన్వేషించి మన దేశం మార్కెట్ లను విస్తరించుకోవడం అవసరం. అప్పుడే మన ఎగుమతుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతాము. దేశంలో ద్రవ్యోల్బణ రేటు మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను ప్రభావితం చేస్తోంది. దేశంలోని ధరలను బట్టే బియ్యం, గోధుమ, చక్కెర, ఉల్లిగడ్డల ఎగుమతులను అనుమతిస్తున్నారు. 2023 -24లో వీటి ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి ఎగుమతులను నిరోధించారు. అలాంటి సందర్భాలలో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయలేక విశ్వసనీయత కోల్పోవాల్సి వస్తోంది. అందువల్ల నిలకడ అయిన ఎగుమతుల విధానం ఉంటే మేలని ఎగుమతి దారులు అంటున్నారు. ప్రపంచ విపణిలో ముడి చక్కెరకు మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది అక్టోబర్ నుండి భారత చక్కెర ఉత్పత్తి 350 లక్షల టన్నుల మేర ఉండగలదని, 285 టన్నులు దేశీయ వినియోగానికి పోగా, 65 లక్షల టన్నులు ఎగుమతికి అందుబాటులో ఉంటుంది. సకాలంలో ఎగుమతులను అనుమతించకపోతే దేశంలో చక్కెర ధరలు తగ్గుతాయి. ఏ సమయంలో ఎంత ఎగుమతి చేయాలో నిర్ణయాన్ని తమకే ఇవ్వాలని చక్కెర పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. హఠాత్తుగా ఆంక్షలు ఎగుమతి సుంకాలు విధించడం వల్ల ధరలు తగ్గి అన్నదాతలు ఆదాయం కోల్పోయి దుస్థితికి గురవుతున్నారు. ఉల్లి ఎగుమతులపై రెండేళ్ళ క్రితం నిషేధం విధించడం వల్ల ధరలు పడిపోయి మహారాష్ట్రలో రైతులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నిషేధాన్ని ఎత్తేసినా ప్రయోజనం లేకపోయింది. పంటను రైతులు కల్లాల్లోనే వదిలేసి సాగు ఖర్చుకూడా రాక అప్పుల పాలయ్యారు. నిలకడలేని ఎగుమతి దిగుమతి విధానం వల్ల రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నామని రైతు ఉత్పత్తిదార్ల సహకార సంఘాలు వాపోతున్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి భారత్ 7.45 బిలియన్ల విలువైన రొయ్యలు, చేపలు ఇతర సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసింది. వాటిలో మూడింట రెండువంతులు రొయ్యలే. వాటిలో అమెరికాకు రొయ్యల ఎగుమతులు 35% మేర ఉన్నాయి.

# తెలంగాణాకు దక్కాల్సిన నీటి వాటా కేటాయింపులను ఎట్టి పరిస్థితుల్లో సాధించి తీరుతాం

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం

23 న జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 లో బలమైన వాదనలు వినిపిస్తాం

తెలంగాణా కు న్యాయంగా రావాల్సిన నీటి వాటాను సద్వినియోగం చేసుకుంటాం

త్రాగు,సాగు నీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు

తాను స్వయంగా పాల్గొంటాను

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చర్చలలో పాల్గొంటారు

71%నీటి వాటకై గట్టిపట్టు పడుతాం

65% తెలంగాణా ప్రాజెక్టులకు కేటాయించాలని ఇప్పటికే KWDT ముందుంచాం

-మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**సెప్టెంబర్ 23 న జరగనున్న కృష్ణా జలాల వివాద-2 విచారణలో తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణాకు చెందాల్సిన నీటివాటలో చుక్క నీరు కుడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు.

ఈ నెల 23 నుండి 25 వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తాను స్వయంగా పాల్గొనబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం రోజున ఆయన నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో న్యాయనిపుణులు,నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ. ఎన్.సి అంజద్ హుస్సేన్ సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్ వైద్యనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇదే అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని ఢిల్లీకి చేరుకుని సమీక్షిస్తారని ఆయన వెల్లడించారు.

కృష్ణా జలాశయాలలో తెలంగాణా రాష్ట్ర వాటాను సాధించేందుకు బలమైన వాదనలు వినిపించేందుకు పూర్తి స్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని వారు ఇచ్చే నివేదికల ఆధారంగా న్యాయవాదులు తెలంగాణా రాష్ట్రానికి చెందాల్సిన నీటివాటపై వాదనలు వినిపించ నున్నారని ఆయన పేర్కొన్నారు.

KWDT ఎదుట 2025 ఫిబ్రవరి నుండి వాదనలు కొనసాగుతున్నాయని,సమైక్యాంధ్రలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ప్రస్తావించారని ఆయన తెలిపారు. శాస్త్రీయంగా నీటి కేటాయింపులు, ఆంధ్రప్రదేశ్ చేపట్టిన అనధికార బేసిన్ ల వివరాలు,తెలంగాణా ప్రాంతంలో సాగునీటి అవసరాలు అందులో పొందు పరచరన్నారు.

ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలువల సామర్థ్యాలను పెంచుకుంటూ గోదావరి,పట్టిసీమ,చింతలపూడి,పులిచింతల నీరు అక్రమంగా తరలించుకు పోతున్న అంశాలను ఇప్పటికే ట్రిబ్యునల్ ముందు ఉంచామన్నారు.

1956 జలవివాద చట్టం,2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన విషయంపై వాదనలు వినిపించామన్నారు.

811 టి.యం.సి ల కృష్ణా జలాశయాలలో తెలంగాణా ప్రాంతానికి 71 శాతం కేటాయింపులు ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.ఇక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65% కేటాయింపులు ఉండాల్సిందే నన్నారు.

పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రిబ్యునల్ కు సమర్పించా మని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని ఆయన పునరుద్ఘాటించారు.

ఇప్పటికే ట్రిబ్యునల్ ఎదుట వాదనలు పూర్తిగా వినిపించగా తాజాగా అధికారులు అందిస్తున్న నివేదికల ప్రకారం జూన్,జులై మాసాలలో ఇక్కడికి అవసరమైన నీటి కోసం 80 టి.యం.సి ల నీటిని అందుబాటులో ఉంచేలా వాదనలు విపించడంతో పాటు ఆపరేషన్ ప్రొటో కాల్ నిబంధనల ననుసరించి మిగిలిన నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణాకు ఉండేలా ట్రిబ్యునల్ ముందట ఉంచుతామన్నారు.

ఐ. ఎస్.ఆర్.డబ్ల్యు.డి చట్టం లోని సెక్షన్ 4(1) ఏ. తో పాటు పునర్వ్యవస్థీకరణ చట్టం లోని పదకొండో షెడ్యూల్ పదో పేరాగ్రాఫ్ వంటి న్యాయపరమైన అంశాలను కుడా ఈ విచారణలో వాదించబోతున్నట్లు ఆయన వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా వినియోగిస్తున్న 291 టి.యం.సి ల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందే నని ఆయన డిమాండ్ చేశారు.సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్, నదుల నిర్వహణ బోర్డు ల ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణా లో కడుతున్న ప్రాజెక్టులపై అడ్డుపడుతుండడంతో ఒకింత ఆలస్యం జరుగుతొందని ప్రాజెక్ట్ ల నిర్మాణాలపై తెలంగాణా కు ఉన్న హక్కులను కుడా ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనలలో వినిపిస్తామన్నారు.

తమ వాదనలకు బలం చేకూరేలా ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణాల అంశాలతో కూడిన ప్రత్యేక జీ.ఓ ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు సన్నదమౌతుందన్నారు.

వీటిలో కల్వకుర్తి, నెట్టెంపాడు,పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం త్రాగునీటి అవసరాల కోసం కొత్తగా నిర్మిస్తున్న రిజర్వాయర్ లు,100 టి.యం.సి లను మళ్లించడానికి వీలుగా రూపకల్పన చేసిన జూరాల ఫ్లడ్ ఫ్లో కెనాల్ లు ఉన్నాయన్నారు.

ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకో లేక పోయిందని ఆయన బి.ఆర్.ఎస్ పాలకుల పై మండిపడ్డారు.

గత పాలకుల ఉదాసీనతతోటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించుకుని పోయి ప్రయోజనం పొందిందని బి.ఆర్.ఎస్ పాలకులపై ఆయన మండిపడ్డారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుండే న్యాయంగా తెలంగాణాకు రావాల్సిన నీటి వాటా పై గట్టిపట్టు పడుతున్నామన్నారు.అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ముందుకు పోతున్నామన్నారు.

తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని ట్రిబ్యునల్ ఇప్పటికే గుర్తించిందని తెలంగాణాకు దక్కాల్సిన నీటి వాటా కేటాయింపులను ఎట్టి పరిస్థితుల్లో సాధించి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కేటీఆర్ వ్యాఖ్యల వెనక బీజేపీ నేతలు

## టీపీసిసిఅధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మీడియా సమావేశం




కేటీఆర్ స్థాయిని మించి మాట్లాడుతున్నాడు

కేటీఆర్ నీ స్థాయి ఏంటి?

దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి నీకుందా కేటీఆర్?

కాళేశ్వరం విచారణ నుంచి తప్పించుకునేందుకు మెప్పు కోసం బీజేపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు

కేటీఆర్ వ్యాఖ్యల వెనక బీజేపీ నేతలు

రాహుల్ పై కేటీఆర్ విమర్శలు మోదీ మెప్పుకోసం

ఉప రాష్ట్రపతి ఎన్నికలో సుదర్శన్ రెడ్డి కి మద్దతు తెలపకపోవడంతో మీ వైఖరి బట్టబయలు అయ్యింది.మీరు పరోక్షంగా ఎన్డీయే మద్దతు తెలిపారు

బీజేపీ బిఆర్ఎస్ వేరు కాదు

కవిత వ్యాఖ్యలతో బీజేపీలో బిఆర్ఎస్ మానసికంగా విలీనం అయ్యిందని స్పష్టమైంది

ఎమ్మెల్యేల ఫిరాయింపు గురించి రాహుల్ గాంధీ ఎందుకు స్పందిస్తారు కేటీఆర్

ఎమ్మెల్యేల ఫిరాయింపు స్పీకర్ పరిధిలోని అంశం

వోట్ చోరీ ప్రపంచవ్యాప్తంగా ఆరా తీస్తున్నారు

వోట్ చోరీ అంశాన్ని రాహుల్ గాంధీ బట్ట బయలు చేశారు

కాళేశ్వరం సీబీఐ విచారణ తప్పించుకునేందుకు బిఆర్ఎస్ నేతల అగచాట్లు

కాళేశ్వరం కేసు విచారణ సిబిఐ కి ఇవ్వమని కోరిన కిషన్ రెడ్డి,బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదు

మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ కుటిల ప్రయత్నం

కోట నీలిమకు నోటీసులు రాజకీయ కక్ష్య సాధింపు చర్య

ఈ చర్యను ఖండిస్తున్నాం

2017లో కోట నీటిమ కుటుంబం చిరునామా మార్చాలని ఎన్నికల కమిషన్‌కు ఫామ్-6 ఇచ్చినా ఈసి చర్యలు తీసుకోలేదు

ఫామ్ - 6 ప్రకారం తమ విధులు సక్రమంగా నిర్వహించని ఈసీ ఇప్పుడు బీజేపీ ఒత్తిడితో కోట నీలిమకు నోటీసులిచ్చింది

కోట నీలిమకు నోటీసులపై న్యాయ పరంగా ముందుకు వెళతాం

కాళేశ్వరం అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

48 గంటల్లో కాళేశ్వరం అవినీతిని తేలుస్తామని అన్న కిషన్ రెడ్డి ఎందుకు సైలెంట్ అయ్యారూ

బీజేపీ లో బిఆర్ఎస్ విలీనం లో భాగంగానే కాళేశ్వరం పై విచారణ ఆగిందని భావిస్తున్నాం

# తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి.

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్



**హైదరాబాద్ సెప్టెంబర్ 13 (ప్రజాబలం న్యూస్ )**బీతెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేసారు.వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ, వివిధ ఇన్‌స్టిట్యూట్స్ దగ్గర రాత్రిపగలు చదువుతూ, ఉద్యోగ అవకాశాల కోసం వేచి ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వక, ఏ విధమైన స్పష్టత లేకుండా వ్యవహరిస్తోంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని అవలంభిస్తోంది. నిరుద్యోగులను రోడ్డుపైకి తీసుకువచ్చి, కఠినంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది."35,000, 1,00,000 ఉద్యోగాలు ఇచ్చాం" అని చెప్పడం మాత్రమే, నిజమైన లెక్కలు చూపడం లేదు.జాబ్ క్యాలెండర్ ప్రకారం, %ఖూాజ% తరహా తెలంగాణ పబ్లిక్ కమిషన్ కూడా పరీక్షలు సమయానికి నిర్వహించాలి.నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని మేము డిమాండ్ చేసారు

# అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి మంత్రి గడ్డం వివేకానంద



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13** : రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,చెన్నూరు మండల తహసిల్దార్ మల్లికార్జున లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని పోలబోయిన రమేష్ ఇంటి నుండి పోలోజి సత్యం ఇంటి వరకు అంచనా విలువ 6 లక్షల 80 వేల రూపాయల డి.ఎం.ఎఫ్.టి.నిధులతో అంతర్గత సి.సి.రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రైతు భరోసా పథకాలతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో గల గోదావరి పుష్కర ఘాట్ ను పరిశీలించారు. 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. పుష్కర ఘాట్ ప్రాంతంలో త్రాగునీరు, పారిశుధ్యం,తాత్కాలిక గదులు,వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ,అత్యవసర వైద్య సేవలు ఇతర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వృద్ధులు పుష్కర ఘాట్ వరకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇతరులు ఎవరైనా వాహన పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు నిలిపి నడక ద్వారా పుష్కర ఘాట్ కు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పుష్కరాల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ కు అనూహ్య స్పందన



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాబలం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుండి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 11 బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. రాజీమార్గంలో కేసుల పరిష్కారంకోసం కక్షిదారులు పెద్దఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు యంత్రాంగం చేసిన కృషిని కొనియాడారు



వైవాహిక వివాదాన్ని సామరస్యంతో పరిష్కరించుకొని ఒక్కటైన దంపతులకు అవార్డు అందజేసి అభినందించారు. రాజీమార్గమే రాజమార్గమని, చిన్న తగాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని కక్షిదారులకు సూచించారు కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తోందని తెలిపారు ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమై అవార్డు పాస్ చేస్తే అది అంతిమ తీర్పు అవుతుందన్నారు. కక్షిదారులకు పులిహోర, మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ వారి సౌజన్యంతో కల్పించారు ఈ కార్యక్రమంలో మెజిస్ట్రేట్లు కె. సాయి శ్రీ, బి. రవికుమార్, వి.వినయ్ కుమార్, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెందు రాజమల్లు , పి. పివిడి లక్ష్మి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జే .గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాగం మాధవరావు, చీఫ్ డిఫెన్స్ లిగలు ఎయిడ్ కౌన్సిల్ వి. పురుషోత్తం రావు, డిప్యూటీ లీగల్ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు సీనియర్-జూనియర్ న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు పోలీసు అధికారులు, జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కిరణ్ కుమార్ కోర్టు సిబ్బంది కక్షిదారులు పాల్గొన్నారు

## ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్నఇరిగేషన్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన బజ్జూరి రమణారెడ్డి



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం టీఎన్జీవోస్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా బజ్జూరి రమణారెడ్డి ప్రధాన కార్యదర్శిగా సోమపొంగు శ్రీనివాస్ ఏకగ్రీవంగా రెండవ సారి ఎన్నికయ్యారు అసోసియేట్ అధ్యక్షులు తక్కె పాండా సురేష్ ఉపాధ్యక్షులుగా దాసరి వాసు దేవరాజు ఉపాధ్యక్షులు 2 గా షర్టు వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు 3 గా గుంజలూరి ఉమ శ్రీ ప్రధానకార్యదర్శిగా సోమపొంగు శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా శ్రీ ఎం నరసింహ రావు, సహాయ కార్యదర్శి 2 గా కె అర్జున్ సహాయ కార్యదర్శి 3 గా మహబూబి, కోశాధికారిగా ఈశ్వర బహదూర్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాటి మల్లారెడ్డి పబ్లిసిటీ సెక్రటరీగా సైదులు స్పోర్ట్స్ సెక్రటరీగా షేక్ భాష ఆఫీస్ సెక్రటరీగా కోసూరి సూరిబాబు జిల్లా కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ గోరికల రాంబాబు గోగుల చార్లెస్ ఆమర్లపూడి ఆనందరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు జిల్లా యూనియన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు కొణిదెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాత కమిటీని రద్దుచేసి కొత్త కమిటీ ఎన్నుకొని నియామక పత్రాన్ని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ. కార్యదర్శి తెలుగు శ్రీనివాసరావు అందజేశారు ఈ కార్యక్రమానికి టౌన్ ప్రెసిడెంట్ ఎలక్షన్ ఆఫీసర్ గా బెజ్జంకి ప్రభాకరాచారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు వివిధ మండలాల్లో గల ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ డివిజన్ల నుంచి విరివిగా పాల్గొన్న సిబ్బంది అందరూ కలిసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జనరల్ సెక్రెటరీ ఏలూరు శ్రీనివాసరావు పాల్గొని ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ కి ఎలాంటి చిన్న సమస్య ఎదురైన తెలంగాణ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఎప్పుడు వెన్నంటే ఉంటుందని ఈ సభాముఖంగా తెలియజేశారు అదే విధంగా సిబ్బంది ఎదుర్కొంటున్న

# ట్రాన్స్ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు తప్పిన పెను ప్రమాదం



అల్లాదుర్గంలో విద్యుత్ ట్రాన్స్ పార్మర్‌వద్ద మంటలు చెలరేగిన దృశ్యం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 13 ( ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా,:** అల్లాదుర్గం మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద, శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద, అగ్గి రాజు కోవడంతో, ఎక్కడ ట్రాన్స్ఫార్మర్ పేలి పోతుందో అని, దుకాణదారులు, పాదచారులు, భయంతో పరుగులు తీశారు, విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, ట్రాన్స్ఫర్ కు విద్యుత్ సరపర ఆపివేసి, నీటితో మంటలు ఆర్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు, ట్రాన్స్ఫార్మర్ వద్ద తరచు మంటలు వస్తున్నాయని, విద్యుత్ శాఖ అధికారులకు తరచు ఫిర్యాదు చేస్తున్న, పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేమితో, కింది స్థాయి అధికారులు ఇష్ట రాజ్యాంగ, మండలంలో నివాసం ఉండకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తుండడంతో,సమాష్యలను, పరిష్కరించలేకపోతున్నారని, అధికారులు సిబ్బంది, అంకితభావంతో, విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...

## దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ రోబోటిక్స్ ఇంటెలిజెంట్ ప్రాసెస్ ఆటోమేషన్ పై సెమినార్



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో "ఏఐ, రోబోటిక్స్ మరియు ఇంటెలిజెంట్ ప్రాసెస్ ఆటోమేషన్ అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఏఐ నిపుణుడు బి. సతీష్ కుమార్ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు ప్రసంగించారు తాజా సాంకేతిక పరిణామాలు, కృత్రిమ మేధస్సు ఏ ఐ ప్రాధాన్యత, రాబోయే కాలంలో రోబోటిక్స్ మరియు ఆటోమేషన్ రంగాలు తీసుకురాబోయే అవకాశాలపై ఆయన విద్యార్థులకు విపులంగా వివరణ ఇచ్చారు. పరిశ్రమల్లో, విద్యారంగంలో, ఆరోగ్యరంగంలో, వ్యాపారాల్లో ఏఐ ఎలా ప్రభావం చూపుతోందో వివరించి, విద్యార్థులు ఈ రంగంలో ప్రావీణ్యం సాధించాలని సూచించారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ మా కళాశాలలో విద్యార్థులకు నిత్యం కొత్త విషయాలపై అవగాహన కలిగించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించటం మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్ సాంకేతికతలలో విజయం సాధించడానికి ఇలాంటి సెమినార్లు ఎంతో దోహదపడతాయి అన్నారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చైతన్య విభాగాధిపతులు ఏవో చిరంజీవి ప్రియాంక మానస రాజ్ నవీన్ పుల్లయతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## "రాజీతో- రాజా మార్గం" జాతీయ లోక్ అదాలత్ 18,208 కేసులు పరిష్కారం

### జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ




**రాజన్న సిరిసిల్ల జిల్లా సెప్టెంబర్ - 13 (ప్రజా బలం (ప్రతినిధి)** జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులు వారి యొక్క సివిల్, క్రిమినల్ కేసులను, నేడు జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 18,208 కేసుల ను పరిష్కరించడం జరిగిందని అందుకు గాను రూ.3,06,77,036/- లను నష్ట పరిహారంగా ఇప్పించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ తెలిపారు.

కేసుల వివరాలు:

మోటార్ వాహన ప్రమాద కేసులు: 06
సివిల్ తగాదాలు : 07
క్రిమినల్ కేసులు: 284
ఎక్సైజ్ కేసులు: 18
చెక్ బౌన్స్ కేసులు : 13
కుటుంబ తగాదాలు : 11
సైబర్ క్రైమ్ : 80
బ్యాంకు కేసులు : 141
%దీూచీూ: 25
%డ్రంక్ అండ్ డ్రైవ్ : 2384
ట్రాఫిక్ చలాన్ కేసులు : 15,239.

16 సంవత్సరాల కేసు నేడు కొట్టివేత. 2009 వ సంవత్సరంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్స్టిట్యూట్ అయిన ఇంజక్షన్ షూట్, 2024వ సంవత్సరంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ట్రాన్స్ఫర్ కావడం జరిగింది. అట్టి కేసు నేటి జాతీయ లోక్ అదాలత్ లో ఇరువురు కక్షిదారుల సమక్షంలో పరిష్కరించడం జరిగింది.

## బెజవాడలో డయేరియా...

విజయవాడ, సెప్టెంబర్ 13. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా బాధితులు కోలుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 115 కేసులు నమోదైనాయి. వీరిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు 61 మంది. చికిత్స తీసుకొని మరో 54 మంది డిశ్చార్జ్ అయినారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అక్కడ మెడికల్ క్యాంప్ కొనసాగుతుంది. డయేరియా కారణంగా స్థానికులు కాచి చల్లార్చిన నీరే తాగాలని వైద్యాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బాధితులకు మెడికల్ టెస్ట్లు కొనసాగుతున్నాయి. ఇక్కడి డయేరియా కేసుల పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ ఓవైపు బాధితులు కోలుకుని ఇంటికి వెళ్తుంటే మరోవైపు కొత్త కేసులు నమోదవుతున్నాయి. న్యూ రాజరాజేశ్వరి పేట వైద్య శిబిరంలో ఈ రోజు కొత్తగా మరో 5 గురు అడ్మిట్ అయ్యారు. దీంతో 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో సచివాలయాల వారీగా బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఎంపీడీవో స్థాయి అధికారి పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులు, వాంతులు, విరేచనాలతో ఎవరైనా బాధపడుతున్నారా? అనే సమాచారాన్ని సేకరించే పనిలో అధికార గణం పని చేస్తుంది. పాత రాజరాజేశ్వరి పేటలో పెరుగుతున్న డయేరియా కేసులు.. ఇప్పటివరకు 100 దాటిన డయేరియా బాధితుల సంఖ్య. నిన్న రాత్రి మెడికల్ క్యాంప్‌లో 30 మంది చికిత్స కోసం వచ్చారు. మరికొందరు బాధితులు వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇప్పటికే పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసిన అధికారిక యంత్రాంగం. విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. మంచినీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ నీటి నమూనాలను పరీక్షకు పంపించామన్నారు. మరోవైపు ల్యాబ్ రిపోర్ట్ నెగెటివ్ రావడంతో మంచినీటి సరఫరా కూడా నిలిపివేశామన్నారు. ఇప్పటి వరకు డయేరియాతో ఎవరూ చనిపోలేదని, వదంతులు నమ్మొద్దని మంత్రి సత్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# అమరావతిపై మద్దతుగా వైసీపీ

అమరావతి, సెప్టెంబర్ 13. మూడు రాజధానుల పేరుతో చేసిన రాజకీయం ఘోరమైన ఓటమిని తెచ్చిపెట్టడంతో వైసీపీ పునరాలోచనలో పడింది. ఓ వైపు అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతూండటం, నిధుల కొరత లేకపోవడంతో మరో మూడేళ్లలో అమరావతి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధానమైన ప్రభుత్వ భవనాలన్నీ పూర్తవుతాయి. మౌలిక సదుపాయాలు ఏర్పడతాయి. అదే సమయంలో పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులును తెచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. క్వాంటమ్ వ్యాలీ, యూనివర్శిటీలు సహా పెద్ద పెద్ద సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ వ్యూహం మార్చుకున్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్ర కో-ఆర్డినేటర్ మరియు మాజీ మంత్రి సజ్జల రామకృష్ణ రెడ్డి మంగళగిరిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో మాట్లాడుతూ, “వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే, అమరావతి రాజధానిగా కొనసాగుతుంది. ముఖ్యమంత్రి జూ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోనే నివసిస్తారు, విశాఖపట్నంకు వెళ్లరు” అని వ్యాఖ్యానించారు. గతంలో విశాఖపట్నంకు మారాలని ఆలోచించామని, కానీ అది సాధ్యం కాలేదనన్నారు. మూడు రాజధానులను ప్రజలు వద్దన్నారని అందుకే తాము పునరాలోచిస్తున్నామన్నారు. “లక్షల కోట్ల అప్పులు చేసి అమరావతి కట్టడానికి మేము వ్యతిరేకమే. బెజవాడ-గుంటూరు మధ్య రాజధాని నిర్మిస్తే రెండు నగరాలు బాగా అభివృద్ధి చెందేవి” అని సజ్జల వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పేరుతో చంద్రబాబు నాయుడు తన అనుచరులకు మాత్రమే ప్రయోజనం చేయాలని కుట్ర పన్నారు. మేము మళ్లీ రాజకీయంలోకి వస్తే, అమరావతి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తాము, కానీ రాజధాని భావనను మార్చకుండా ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు. కొండవీటి వాగులో అమరావతిని నిర్మిస్తున్నారని.. మునిగిపోయే చోట నిర్మిస్తున్నారన్నారు. అమరావతి ఒక్కటే రాజధాని కాదు .. గుంటూరు-విజయవాడ మధ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాము .. అధికారంలోకి వస్తామని వ్యాఖ్యానించారు. రాజధాని అంశంపై వైసీపీలో గందరగోళం ఏర్పడినట్లుగా కనిపిస్తోంది. మూడు రాజధానులు వదిలేసి, అమరావతిని ఒప్పుకున్నట్టు కనిపించడంతో, పార్టీ కార్యకర్తలు తమ విధానం మారిందా అని వాకబు చేస్తున్నారు.వైసీపీ నేతలు అనుకున్నట్టుగా రెండోసారి అధికారం దక్కలేదు. కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి నిర్మాణంలో కదలిక వచ్చింది. జంగిల్ కటింగ్ పూర్తయింది. భవనాల నిర్మాణం మళ్లీ ప్రారంభమైంది. దీనికి తోడు కేంద్రంలో కూటమికి విపరీతమైన ప్రాధాన్యం లభిస్తూ ఉండడంతో రాజధాని నిర్మాణానికి భారీగా నిధులు వస్తున్నాయి. ఈ నిధులతో అద్భుతమైన భవనాలు నిర్మించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణంలో పెడుతున్న భారీ ఖర్చును వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు. ముఖ్యంగా వైసీపీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి కూటమి ప్రభుత్వ వ్యవహారాన్ని ఎండగడుతున్నారు. అమరావతి లో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే సరిపోతుంది. అంతేగాని కోట్లకు కోట్లు పునాదుల్లోనే ఖర్చు చేస్తే ఉపయోగం ఉండదు. దీనివల్ల రాజధాని నిర్మాణం బారమవుతుంది. అమరావతి పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలంటే 20 సంవత్సరాల వరకు పడుతుంది. అప్పటివరకు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు మొత్తం దీనికి ఖర్చు చేస్తామంటే ఎలా? అమరావతి నిర్మాణాన్ని పూర్తిచేస్తే సహకరిస్తాం. నిర్మాణ విషయంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే వ్యతిరేకిస్తాం. అప్పుడు రాజధాని నిర్మాణాల్లో పునరేకీకరణ అంశాన్ని పరిశీలిస్తాం. ఒకవేళ మేము అధికారంలోకి వస్తే అమరావతి కేంద్రంగానే పరిపాలన సాగిస్తాం. మూడు రాజధానుల అంశాన్ని పరిశీలనలోకి తీసుకోబోమని” సజ్జల పేర్కొన్నారు.సజ్జల చేస్తున్న వ్యాఖ్యలు ఏపీ రాజకీయాలలో మంటలు పుట్టించాయి.. టిడిపి నేతలు సజ్జల వ్యాఖ్యలకు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు.”అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన సాగిస్తామన్నారు. అమరావతిని పడుకోబెట్టారు. మిగతా ప్రాంతాలలో పెద్దగా భవనాలు నిర్మించలేదు. ప్రభుత్వపరంగా కార్యక్రమాలను వేగవంతం చేయలేదు. చివరికి ఇప్పుడేమో అమరావతి కేంద్రంగానే పరిపాలన సాగిస్తాం అని చెబుతున్నారు. మూడు రాజధానుల విషయంలో వెనక్కి తగ్గారు. అప్పట్లో విపరీతంగా ఖర్చు పెట్టారు. వైసిపి నిర్లక్ష్యం వల్ల అమరావతి ప్రాంతంలో జంగిల్ విపరీతంగా పెరిగింది. దానిని నిర్మూలించడానికి చాలావరకు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఒకవేళ నాటి ప్రభుత్వం గనుక పకడ్బందీగా వ్యవహరించి ఉంటే ఇక్కడదాకా వచ్చి ఉండేది కాదు కదా అని” టిడిపి నేతలు అంటున్నారు.

మొత్తానికి వైసీపీ నేతలకు జ్ఞానోదయం అయ్యిందని చెబుతున్నారు.

అయితే పార్టీ నేతలు అమరావతి రైతుల్ని మభ్యపుచ్చడానికి ఇలాంటి మాటలు చెబుతున్నారని .. గతంలోనూ జగన్ తాను అమరావతిలోనే ఉంటానని చెప్పారని అంటున్నారు. వైసీపీ గతంలో అమరావతినే రాజధానిగా ఉంటుందని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత మూడు రాజధానులు అనడం వల్ల ప్రజలు నమ్మకం కోల్పోయారు. మరోసారి అదే మాట చెప్పినా నమ్మరని టీడీపీ నేతలంటున్నారు.

## డయోరియా మృతి అవాస్తవం

విజయవాడ మీడియాలో శుక్రవారం రాత్రి డయేరియాతో ఒక వ్యక్తి చనిపోయాడని వచ్చిన వార్తలన్నీ అవాస్తవం అని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ సుహాసిని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి న్యూ రాజరాజేశ్వరి పేట వద్ద ఏర్పాటుచేసిన డయేరియా మెడికల్ క్యాంపులో ఆమె మీడియాతో మాట్లాడారు. కుటుంబ కలహాల వలన మద్యం సేవించిన వ్యక్తి గుండె నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

అన్నమయ్యఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అన్నమయ్య జిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. రోడ్డు దాటుతున్నవారిని ఆర్కే ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఓబులవారిపల్లె మండలం మంగళంపల్లిలో ఘటన జరిగింది. మృతులు అంకమ్మ(70), రామచంద్రయ్య(55).

# ఆలయాల సందర్శనకు రైలు రెడీ

హైదరాబాద్, సెప్టెంబర్ 13, దక్షిణాదిన పుణ్య క్షేత్రాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే దక్షిణాదిన ఉండే అనేక పుణ్య క్షేత్రాలకు నిత్యం దేశం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వెళుతుంటారు. అయితే దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడపనుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడపనుంది. ఈ నెల 23వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే గభారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు దక్షిణాదిన ఉన్న అనేక ఆలయాలను చుట్టివస్తుంది. ఈ ప్రత్యేక రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను దర్శించుకునే వీలుంది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు ఽ రేణిగుంట వంటి ముఖ్యమైన స్టేషన్లలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు వీలుంది. ఈ యాత్ర మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది రోజుల వ్యవధిలో సాగుతుంది. ఇందులో అన్ని ప్రయాణ సౌకర్యాలు (రైలు మరియు రోడ్డు రవాణాతో సహా), వసతి సౌకర్యం, బోజన వసతిని కూడా కల్పిస్తారు. తిరువణ్ణామలై - అరుణాచలం ఆలయం రామేశ్వరం - రామనాథస్వామి ఆలయం మధురై - మీనాక్షి అమ్మన్ ఆలయం కన్యాకుమారి - రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం త్రివేండ్రం - శ్రీ పద్మనాభస్వామి ఆలయం తిరుచ్చి - శ్రీ రంగనాథస్వామి ఆలయం తంజావూరు - బృహదీశ్వర ఆలయం టూర్ ధర ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ లో పథ్నాలుగువేలు, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర 22,500 రూపాయలు, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర 29,500 రూపాయలుగా నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఈ రైలులో దక్షిణ భారతంలోని ఆలయాలను దర్శించుకునేందుకు టిక్కెట్లను బుక్ చేసుకోవాలంటే 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించవచ్చు.

# ఆర్టీసీ అప్ డేట్

హైదరాబాద్, సెప్టెంబర్ 13, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. స్మార్ట్ కార్డులను ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ఆర్టీసీ టికెటింగ్ మరియు బస్ పాస్ వ్యవస్థను ఆధునీకరించడానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రయాణాలకు స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టనుంది. మొదట ఈ సౌకర్యాన్ని విద్యార్థుల బస్ పాస్‌లతో ప్రారంభించి, తరువాత మహిళల కోసం అమలు చేస్తున్న ‘మహాలక్ష్మి’ ఉచిత బస్సు ప్రయాణ పథకం లబ్ధిదారులకు విస్తరించనున్నట్లు అధికారిక వర్గాలువెల్లడించాయి. టీజీఆర్టీసీ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, బస్ పాస్‌లు పొందడం, రెన్యువల్ చేయడం మరింత సులభం కావడంతో పాటు, సంస్థ డిజిటల్ టెక్నాలజీకి అనుగుణంగా ముందడుగు వేయనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలకుపైగా విద్యార్థి బస్ పాస్‌లు ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పటివరకు విద్యార్థులు రెన్యువల్ కోసం ప్రత్యేక కౌంటర్లకు వెళ్లాల్సి వచ్చింది. ప్రతిపాదిత స్మార్ట్ కార్డు వ్యవస్థ అమలులోకి వస్తే, వీటిని డిజిటల్‌గా రీచార్జ్ చేసుకోవచ్చు. ఇకపోతే, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో అమలులో ఉన్న స్మార్ట్ కార్డు మోడళ్లను ఆర్టీసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, లక్నో వంటి మహానగరాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని తెలుసుకున్న టీజీఎస్ ఆర్టీసీ అధికారులు రాష్ట్రంలోనూ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పద్ధతిని, అక్కడ స్మార్ట్ కార్డులు మంజూరు చేసే విధానాన్ని అధ్యయనం చేయనుంది. . ఎప్పటి నుంచి అంటే? అధ్యయనం చేసిన తర్వాత... ఆ యా రాష్ట్రంలో సమగ్ర అధ్యయనం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులను గుర్తించి, తెలంగాణలో ప్రయాణికులకు అనుకూలంగా అమలు చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం రాబోయే నెలల్లో దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించడానికి మహిళలు తమ ఆధార్ కార్డులు చూపించాల్సి వస్తోంది. స్మార్ట్ కార్డులు ప్రవేశిస్తే ఈ ధృవీకరణ అవసరం ఉండదు. దీంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు వినియోగించే లక్షలాది మహిళలకు మరింత సౌలభ్యం కలుగుతుందని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నమూనాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే స్మార్ట్ కార్డుల రూపకల్పన పై టీజీ ఆర్టీసీ తుది నిర్ణయం తీసుకోనుం

# సాఫ్ట్ వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం
## భారీగా ఆస్తి నష్టం




హైదరాబాద్ మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో శనివారం ఉదయం 4:30 గంటలకు మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు కంపెనీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. సమయానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం ఎంత జరిగిందో ఇంకా తెలియాల్సి ఉంది.



# కాన్ క్లేవ్ పేరుతో వైట్ కాలర్ దోపిడీ

హైదరాబాద్, సెప్టెంబర్ 13 రాజకీయ నాయకులు ప్రచారాన్ని కోరుకుంటారు. నిత్యం వార్తల్లో ఉండాలని అనుకుంటారు. తమ గురించి మాత్రమే మీడియా గొప్పగా చెప్పాలని.. తమకు నచ్చని వారిపై నిత్యం రాళ్లు వేస్తూ ఉండాలని.. బురద కుమ్మరిస్తూ ఉండాలని అనుకుంటారు. సహజంగా రాజకీయ నాయకులు కూడా మనుషులే కాబట్టి.. వారికి కూడా ఆశలు ఉంటాయి కాబట్టి తప్పులేదు. కానీ వారి మాదిరిగానే ప్రత్యర్థి నాయకులు కూడా అలానే ఆలోచిస్తారు కాబట్టి.. మీడియాకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. ఒకరి గురించి చెప్తే మరొకరు బాధపడతారని నిశ్శబ్దంగా ఉంటుంది. అయితే నేటి కాలంలో రాజకీయ నాయకులు ఆరి తేరి పోయారు కాబట్టి సొంతంగా మీడియా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరైతే పరోక్షంగా మీడియా వ్యవస్థలను నడిపిస్తున్నారు.గతంలో పత్రికలను మాత్రమే నాయకులు మేనేజ్ చేసేవారు. కొంతకాలానికి న్యూస్ చానల్స్ వచ్చాయి. ఇప్పుడు సోషల్ మీడియా గ్రూపులు అదనంగా జత కూడిపోయాయి. ఆయనప్పటికీ రాజకీయ నాయకులకు ప్రచార యావ తగ్గడం లేదు. పైగా తమ మాటలను మాత్రమే ప్రజలు వినాలి అని కోరిక వారిలో అంతకంతకు పెరిగిపోతోంది. రాజకీయ నాయకుల ప్రచార పిచ్చిని కొన్ని మీడియా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. అయితే చేసేది ఎలాగూ వైట్ కాలర్ దోపిడీ కాబట్టి మీడియా అధినేతలు దానికి సరికొత్త పేరు పెడుతున్నారు.విదేశాలలో ఎన్నికలు జరిగినప్పుడు పోటీలో ఉండే ఇద్దరు నాయకులను ఒకే వేదిక మీద తీసుకొస్తారు. అక్కడ ఉన్న పాత్రికేయులు రకరకాల ప్రశ్నలు అడుగుతారు. దానికి ఆ ఇద్దరు నాయకులు సమాధానాలు చెప్తారు. ఇందులో ఎటువంటి మీడియా స్వార్థం ఉండదు. పెయిడ్ భజన అంతకంటే ఉండదు. కాకపోతే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ మన దేశంలో ఎన్నికలు లేకున్నా.. ఏదో జరిగిపోతోంది అనే భ్రమను కల్పించడంలో మీడియా ఆరి తేరిపోయింది. పైగా దానికి కాన్ క్లేవ్ అని పేరు పెట్టి.. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను పిలుస్తోంది. పేరుకు భవిష్యత్తు కాలంలో దేశం పరిస్థితి ఏమిటి? రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అని చెబుతుంది. కానీ అంతర్గతంగా మాత్రం పెయిడ్ భజన. ఒక ముక్కలో చెప్పాలంటే అధికార పార్టీ దగ్గర కొంత.. ప్రతిపక్ష పార్టీ దగ్గర కొంత డబ్బులు తీసుకొని.. మీరు మంచివారే.. వారు కూడా మంచివారే.. వెరసి మనమంతా మంచివారమే అనే సందేశాన్ని ఓట్లు వేసిన ప్రజలకు ఇస్తుంది.

ఎన్నో మీడియా సంస్థలు కాన్ క్లేవ్ లు నిర్వహించాయి. ఇంతవరకు అధికార పార్టీ చేసిన తప్పులను గాని.. ప్రతిపక్ష పార్టీ చేసిన అన్యాయాలను గాని వెలుగులోకి తీసుకురాలేకపోయాయి. న్యూట్రల్ గా ఉండాల్సిన మీడియా హౌస్ లోకి ఒక రాజకీయ నాయకుడు ప్రవేశించాడు అంటేనే దాని వెనుక ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే ఒకప్పుడు రాజకీయ నాయకుల నుంచి యాడ్స్ తీసుకునేవారు. ఆ తర్వాత పెయిడ్ ప్రమోషన్ మొదలుపెట్టారు. ఇప్పుడేమో కాన్ క్లేవ్ లు నిర్వహిస్తున్నారు. పేర్లు మాత్రమే తేడా.. చేసే వైట్ కాలర్ దోపిడీ మాత్రం ఒకటే.

# ఇండియా కు ట్రంప్




ముంబై, సెప్టెంబర్ 13, భారత్‌పై సుంకాలతో ఒకవైపు విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ వాటిని లెక్క చేయకపోవడంతో ఇప్పుడు దిగివస్తున్నారు. ప్రధాని మోదీతో మాట్లాడతానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల సముదాయం అయిన క్వాడ్ సదస్సు ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో జరగనుంది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కావడంపై మొదట్లో ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. తాజా ఉద్రిక్తతలు, యూఎస్ అంబాసిడర్ సెర్గీ గోర్‌ల చర్చలు మొదలైనప్పటికీ సమ్మిట్‌కు ట్రంప్ రాకపోవచ్చని తెలుస్తోంది.యూఎస్ అంబాసిడర్ టు ఇండియా సెర్గీ గోర్, ట్రంప్ ఈ సమ్మిట్‌కు చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇది భారత్‌తో అమెరికా సంబంధాల్లో బలమైన ఆసక్తిని సూచించింది. మొదట్లో, ట్రంప్ జూన్‌లో మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు ప్రకటించారు. ఇది ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని అరికట్టడానికి క్వాడ్‌లో అమెరికా కట్టుబాటును బలపరచడానికి సహాయపడుతుందని భావించబడింది. ఈ సమ్మిట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా, జపాన్ నేతతోపాటు ట్రంప్ చర్చలు జరిగితే, ఆర్థిక, రక్షణ, సాంకేతికతా సహకారాలు మరింత బలపడతాయని అంచనా.ఇటీవలి నెలల్లో పరిస్థితులు మారాయి. న్యూయార్క్ టైమ్స్ వంటి మీడియా రిపోర్టుల ప్రకారం, ట్రంప్ ఇండియా సందర్శనను రద్దు చేసి ఉండవచ్చు. ఇందుకు ప్రధాన కారణాలు ట్రంప్?మోదీ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు. ట్రంప్, ఇండియా?పాకిస్తాన్ యుద్ధాన్ని తాను ‘పరిష్కరించాను‘ అని పదేపదే ప్రకటించడం మోదీని కోపోద్రేకంచేసింది. ఇది ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి మోదీ మద్దతు కోరుకోవడంతో మరింత తీవ్రమైంది. జూన్ 17న జరిగిన 35 నిమిషాల ఫోన్ కాల్‌లో మోదీ, అమెరికా జోక్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇలా రెండు నేతల మధ్య విశ్వాసం దెబ్బతినడంతో, ట్రంప్ ఇప్పుడు నవంబర్ సమ్మిట్‌కు రాకపోవచ్చని సమాచారం.తాజాగా ట్రంప్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. భారత్‌ను దూరం చేసుకోవడంతో అమెరికాకే నష్టం అని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ భారత్‌తో సయోధ్యకు సై అంటున్నారు. ఇందుకు మోదీ కూడా సానుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో క్వాడ్ సమావేశంలో ఇద్దరూ భేటీ కావడం ద్వారా చైనాకు చెక్ పెట్టడంతోపాటు భారత్?అమెరికా సంబంధాలు పునరుద్ధరించే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే ట్రంప్ భారత్‌కు వస్తారని అంచనా వేస్తునానరు. ట్రంప్ రాకపోతే, క్వాడ్ సమ్మిట్ పూర్తి స్థాయిలో జరగకపోవచ్చు. అమెరికా?భారత వాణిజ్య చర్చలు ఆగిపోవచ్చు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు:

రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన రేణికుంట అజయ్(సింగర్డ డ్యాన్స్ మాస్టర్) వారి తండ్రి రేణికుంట పోచయ్య గత కొన్ని రోజుల క్రితం మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ శనివారం పరామర్శించారు. అనంతరం రేణికుంట పోచయ్య చిత్రపటానికి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యులు రేణికుంట హరీష్ దుర్గయ్య నాయకులు పూడూరు మల్లేశం ఎడవల్లి పాపిరెడ్డి వేల్పుల హరికృష్ణ దాసరి అరుణ్ కుమార్ పురాణం రమేష్ దాసరి శంకరయ్య దాసరి రమేష్ రేణికుంట శ్రావణ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


# నేడు హిందీ భాషా దినోత్సవం




హిందీ భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14 న జరుపుకుంటారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ పొందుపరిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ రోజున హిందీ భాషా దినోత్సవమును జరుపుకుంటారు. దేవనాగరి లిపిలో వ్రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో ఒకటిగా భారత రాజ్యాంగ సభచే జరుపుకుంటారు. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బీహార్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త్, సేథ్ గోవింద్ దాస్ లు ర్యాలీలు చేసారు. అందుకని, 1949 సెప్టెంబర్ 14 న బీహార్ రాజేంద్ర సింహా 50 వ పుట్టినరోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయి. హిందీ, ఇంగ్లీష్. ఆధునిక హిందీని నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందీకి సంబంధించిన వివిధ రంగాలలో రాణించినందుకు వివిధ విభాగాలలో పురస్కారాలులు ప్రధానం చేశారు.మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పిఎస్‌యులు, జాతీయం చేసిన బ్యాంకులకు రాజ్‌భాషా పురస్కారాలు ప్రధానం చేశారు.హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015 మార్చి 25 నాటి ఉత్తర్వులలో హిందీ దివస్‌పై ఏటా ఇచ్చే రెండు పురస్కారాల పేర్లను మార్చింది. 1986 లో స్థాపించబడిన "ఇందిరా గాంధీ రాజ్‌భాషా పురస్కార్"ను "రాజ్‌భాషా కీర్తి పురస్కార్"గా మార్చారు. 'రాజీవ్ గాంధీ రాష్ట్రీయ జ్ఞాన్-విజ్ఞాన్ మౌలిక్ పుస్తక్ లేఖన్ పురస్కార్' ను "రాజ్‌భాషా గౌరవ్ పురస్కార్"గా మార్చారు.

# హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

## -నేడు ఆయన వర్ధంతి



బూర్గుల రామకృష్ణారావు బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా కూడా పనిచేసాడు. రామకృష్ణరావు 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు మహబూబ్ నగర్ జిల్లా, తలకొండ పల్లి మండలం కల్వకుర్తి దగ్గరలోని పడకల్ గ్రామంలో జన్మించాడు. వీరి స్వగ్రామం బూర్గుల, ఇంటి పేరు పుల్లం రాజు వారు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే వారి ఇంటిపేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాడు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివాడు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివినరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశాడు. బూర్గుల1924లో పెళ్ళి చేసుకున్నాడు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరాడు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నాడు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసాడు.హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖుడు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించాడు. శాసనోల్లంఘన ఉద్యమంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను పాల్గొని కారాగారవాసం అనుభవించాడు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్యమంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యాడు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్దత కల్పించాడు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించాడు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో వీరు చేపట్టిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నాడు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా గొప్ప సాంస్కృతిక సేవలందించాడు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించాడు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యాడు. ఆ ఏర్పడిన ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యాడు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్యమంత్రిగా పేరుగాంచాడు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా వెళ్ళాడు. 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పనిచేసాడు. 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది.బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండెపోటుతో మరణించాడు

# వేములవాడలో తప్పని యూరియా కష్టాలు

**గ్రోమోర్ ఎరువుల దుకాణం ముందు తెల్లవారుజాము నుండే క్యూ కట్టిన రైతులు**

**యూరియా కోసం లైన్ లో చెప్పులు, ఆధార్ కార్డులు, రాళ్లు పెట్టిన ఎదురు చూస్తున్న మహిళ రైతులు**

**నిన్న రైతుకు ఒక్క బ్యాగు చొప్పున పంపిణీ చేసిన అధికారులు**

**ఎకరాన ఒక బ్యాగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న రైతులు**

వేములవాడ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. నిద్ర లేచింది మొదలు యూరియా కోసం సొసైటీలు, గ్రోమోర్ సెంటర్ ల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేములవాడలో వేకువజాము నుంచే రైతులు చెప్పులు, ఆధార్ కార్డులు, రాళ్లు క్యూలో పెట్టారు. మహిళలు పురుషులు అనే తేడా లేకుండా కుటుంబ సభ్యులతో రైతులు యూరియా పంపిణీ చేసే సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రోజంతా వెయిట్ చేసిన రైతుకు ఒక బస్తా కంటే ఎక్కువ ఇవ్వడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి ఒక బస్తా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలా?...లేక యూరియా కోసం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సొసైటీల చుట్టు తిరగాలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ తీరు అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సరిపడా యూరియా వెంటనే సప్లై చేయాలని కోరుతున్నారు.

# కవితకు అండగా కేసీఆర్...



హైదరాబాద్, సెప్టెంబర్ 13, ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు అంటారు. తెలంగాణ సమాజం ఈ సామెతను బలంగా నమ్ముతుంది. ఆడబిడ్డను సాక్షాత్తు ఇంటి దేవతగా కొలుస్తూ ఉంటుంది. ప్రతి పండుగకు చీరె సారే పెడుతూ గౌరవించుకుంటుంది. దీనికి ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదు. తెలంగాణ అంటేనే ఒక బలమైన అస్తిత్వానికి ప్రతీక. అందువల్లే ఇక్కడ చాలా దృఢమైన ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమాలలో ఆడవారి పాత్రను బలంగా నిలుపుకున్నాయి. సమ్మక్క సారలమ్మ.. రుద్రమదేవి.. చాకలి ఐలమ్మ.. ఇలా చెప్పుకుంటూ పోతే వీరవనితలు.. ధీర వనితలు చాలామంది ఉన్నారు. వారందరూ ఇప్పటికీ కూడా ప్రజల మదిలో మెదులుతున్నారు. తెలంగాణ సమాజం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ వనితలను మననం చేసుకుంటూ ముందుకు సాగింది. తమ స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అడుగులు వేసింది. అలా అడుగులు వేసిన వారిలో కల్వకుంట్ల కవిత కూడా ఒకరు.తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణకు అస్తిత్వం అయిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ఆమె చేసిన సాంస్కృతిక ఉద్యమం మామూలుది కాదు. తెలంగాణ ఆడబిడ్డల్ని ఉద్యమంలో మమేకం చేయడానికి ఆమె ఎత్తుకున్న బతుకమ్మ ఎంతో మందిని కదిలించింది. కదిలి వచ్చేలా చేసింది. తెలంగాణ సాంస్కృతి.. తెలంగాణ సంప్రదాయం అంటేనే బూతు లాగా ధ్వనించిన ఒక సందర్భంలో.. బతుకమ్మ ద్వారా వాటన్నింటిని పటాపంచలు చేసింది కవిత. అందువల్లే ఆమె తెలంగాణ బతుకమ్మగా పేరుపొందింది. ఎంగిలి పూల నుంచి మొదలుపెడితే సద్దుల బతుకమ్మ వరకు ఆమె అడుగు పెట్టని ఊరంటూ లేదు. గౌరమ్మను నిలుపుకోవడం.. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చడం.. పాటలు పాడి చెరువులో నిమజ్జనం చేయడం.. ఇదే క్రతువుగా సాగిపోయింది కవిత. అటువంటి బతుకమ్మకు నేడు కష్టం వచ్చింది. పుట్టిన ఇంటి నుంచి ఇబ్బందికరమైన వాతావరణం ఎదురైంది. పండగపూట ఏ ఆడబిడ్డకు ఇటువంటి కష్టం రావద్దు. ఇటువంటి ఇబ్బంది అసలు రావద్దు. పున్నమి 15 రోజుల్లో వెలుగు వెలిగే చంద్రుడు కూడా.. అమావాస్య రోజులలో మసకబారతాడు. అలాగని ఎప్పటికీ చీకట్లో ఉండిపోడు. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాంటిదే. తాత్కాలికంగా ఆమె ప్రభ కొంతమేర ఇబ్బందికి గురైనప్పటికీ.. ఆ తర్వాతి రోజుల్లో దీపశిఖలాగా వెలుగుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే ఆమె.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభను కోల్పోరు.పుట్టినింటి నుంచి కాస్త ఇబ్బంది ఎదురవుతున్నప్పటికీ.. మేమున్నామంటూ పుట్టిన గడ్డవాళ్ళు కవిత దగ్గరికి వచ్చారు. కెసిఆర్ స్వగ్రామం చింతమడక గ్రామస్తులు తెలంగాణ బతుకమ్మ దగ్గరికి స్వయంగా వచ్చి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామి కావాలని స్వాగతం పలికారు. చీర, సారె, పసుపు కుంకుమలతో సాదర ఆహ్వానం పలికారు. ఒక ఆడబిడ్డకు ఇంతకంటే కావలసిందేముంది. పండగ పూట ఇంతకంటే ఘనమైన ఆతిథ్యం ఇంకొకటి ఏముంటుంది. ఇది తెలంగాణ బతుకమ్మకు దక్కిన నిండైన గౌరవం. కెసిఆర్ కుమార్తెకు కెసిఆర్ స్వగ్రామం నుంచి లభించిన గొప్పదైన సత్కారం. ఇప్పుడు కవిత మనసు చాలా తేలికైంది. గుండెలో భారం తగ్గిపోయింది. ఎందుకంటే తెలంగాణ బతుకమ్మ దగ్గరికి బతుకమ్మ వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది కాబట్టి..

# మేం పార్టీ మారలేదండి....

హైదరాబాద్, సెప్టెంబర్ 13, తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం వివాదాస్పదమైంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికర కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దీనిపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎన్నిక రద్దు చేయాలని కోరింది. కోర్టు చర్య తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదేశించింది. స్పీకర్ జాప్యం చేయడంతో బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

దీంతో సుప్రీం కోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేపై చర్యలకు గడువు విధించింది. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇటీవలే నోటీసులు జారీ చేశారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు తాజాగా స్పీకర్ నోటీసులకు వివరాణ ఇచ్చారు. అయితే విశేషం ఏమిటంటే పది మంది ఎమ్మెల్యేల్లో 8 మంది తాము పార్టీ మారలేదని వివరణ ఇవ్వడం ఇప్పుడు ఆశ్చరకరంగా మారింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ప్రతిపక్షం ఆరోపించింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం, వారిని అనర్హులుగా ప్రకటించాలని పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు గత జులై 31న తీర్పు ఇచ్చి, స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆదేశాలు ఆలస్యాన్ని విమర్శించి, పార్లమెంట్‌కు ఈ విధానాన్ని పునర్విచారించాలని సూచించింది. ఫిబ్రవరి నుంచి నోటీసులు జారీ అయ్యాయి, ఇది రాజకీయ ఒత్తిడిని పెంచింది. ఈ కేసు రాష్ట్రంలో పార్టీ మార్పులకు ఆటంకం కల్పుతున్నట్లు కనిపిస్తోంది.ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా స్పీకర్‌కు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం నియోజకవర్గాల అభివృద్ధి కోసమేనని, పార్టీ సభ్యత్వం మారలేదని చెప్పారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వంటివారు బీఆర్ఎస్ సూత్రాలకు నిబద్ధులమని పేర్కొన్నారు. కొందరు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని, సీఎంతో కలయికలు గౌరవార్థమేనని వివరించారు. ఇక దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరిన్ని రోజులు కావాలని కోరారు. 8 మంది ఎమ్మెల్యేకు ఇందుకు ఆధారాలు కూడా చూపించారు. స్పీకర్ వాటిని ఫిరాయింపు ఆరోపణలు చేసినవారికి పంపారు.కొందరు ఎమ్మెల్యేలకు ప్రభుత్వ పదవులు లభించాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ సలహాదారు పాత్ర, అరికెపూడి గాంధీకి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ స్థానం ఇచ్చారు. ఇది బీఆర్ఎస్‌లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. గతంలో అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసి, పార్టీలో బ్రోకర్లు ఉన్నారని అన్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పడం మాట మార్పుగా కనిపిస్తోంది. పాడి కౌశిక్‌రెడ్డి వంటి నాయకులు సవాల్ విసిరారు.

ఈ పదవులు ఫిరాయింపు ఆరోపణలను మరింత బలపరుస్తున్నాయి, ఎందుకంటే అవి ప్రతిపక్షాలకు కేటాయించాల్సినవి.స్పీకర్ ప్రసాద్ కుమార్ ఒక్కొక్కరినీ విచారించనున్నారు. బీఆర్ఎస్ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకావాలి.

విచారణలు ఆలస్యం చేయకుండా చూడాలని స్పీకర్ హెచ్చరించారు. ఈ ప్రక్రియ బీఆర్ఎస్‌కు ప్రయోజనం కలిగించవచ్చు, ఎందుకంటే ఫిరాయింపులు ఆగిపోయాయి. మొత్తంగా, ఈ కేసులు తెలంగాణలో రాజకీయాలను మార్చవచ్చు. అనర్హత తీర్పు వచ్చిన తర్వాత ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ ఆధిపత్యాన్ని పరీక్షిస్తుంది. రాజ్యాంగపరమైన బాధ్యతలు, రాజకీయ అవకాశవాదం మధ్య సమతుల్యత అవసరమని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.

# జూపల్లి కామెంట్స్ పై చర్చోపచర్చలు

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 13, ఏ మనిషినైనా సరే ఆశావహ దృక్పథం ఉండాలి. సాధిస్తాను అనే సంకల్పం ఉండాలి. గెలుస్తాను అని నమ్మకం ఉండాలి. అలా అయితేనే ముందుకు వెళ్ళగలుగుతారు. అలాకాకుండా నిరాశతో, నిస్పృహతో, భయంతో ఉంటే ఎప్పటికైనా సరే ఓడిపోతారు. ప్రస్తుతం 30 లక్షణాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నాయకుల్లో ఒక రకమైన భయం కనిపిస్తోంది. గులాబీ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరినప్పటికీ.. ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నోటీసులు ఇవ్వడంతో ఒక్కసారిగా స్వరం మార్చారు. తాము అభివృద్ధినిధుల కోసం మాత్రమే ముఖ్యమంత్రిని కలిసినట్టు కవరింగ్ ఇచ్చారు. ఇందులో ఇంకా కడియం శ్రీహరి, మరో ఎమ్మెల్యే వివరణ ఇవ్వాల్సి ఉంది. వీరు మాత్రమే కాదు, మిగతా ఎమ్మెల్యేలు కూడా భయం భయంతోనే ఉన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే విదేశాలకు వెళ్తున్నారు. రైతులు ధర్నా చేస్తుంటే విదేశాల్లో ఉండి వారు వినోదం చూస్తున్నారు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదు.. భయపడుతున్న వారి జాబితాలోకి ఇప్పుడు ఈ జాబితాలోకి మంత్రులు చేరిపోయారు.తాజాగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులెత్తేశారు.. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లోని బోద్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని అక్కడి ప్రజలు ఆయనను డిమాండ్ చేశారు. దీనిపై కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. " వచ్చేసారి నేను గెలుస్తానో లేదో తెలియదు. ఒకవేళ నేను గెలిచినా కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు. అందువల్లే నేను ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వవలేను.. నా జేబులో నుంచి ఖర్చుపెట్టే డబ్బు అయితే చెప్పగలను. ప్రభుత్వం నుంచి వచ్చేదానికి నేను హామీ ఇవ్వలేను" అని మంత్రి స్పష్టం చేశారు.. దీంతో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారాయి. మరో రెండు పర్యాయాలు తానే ముఖ్యమంత్రి అని రేవంత్ చెప్పుకుంటుంటే.. కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి.ఇటీవల కాలంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అదృష్టం మీద నేరుగా విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్న మాటలకే గట్టి కౌంటర్ ఇస్తున్నారు. పుచ్చుకుపల్లి మాత్రం ఏకంగా కాంగ్రెస్ ప్రభుత్వమే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాదని స్పష్టం చేస్తున్నారు.. అంటే ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఆగ్రహం ఉన్నట్టే కదా.. ప్రభుత్వం చేపడుతున్న ఏ పని కూడా ప్రజల్లోకి వెళ్లడం లేదనే కదా.. మరి దీనిపై ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారు.. ఎలాంటి ప్రకటన చేస్తారనేది చూడాల్సి ఉంది. అన్నట్టు జూపల్లి కృష్ణారావు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలి రోజుల్లో ఆయన నియోజకవర్గంలో జరిగిన ఓ ఘటన సంచలనం రేపింది. దాని వెనుక ఉన్నది కృష్ణారావు అని ప్రచారం కూడా జరిగింది. అప్పటినుంచి ఆయన ఏ సభలో కూడా ఆశావాహ దృక్పథంతో మాట్లాడటం లేదని గులాబీ నాయకులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థమైంది కాబట్టి మంత్రులు వాస్తవాలు మాట్లాడుతున్నారని.. కృష్ణారావు జ్ఞానోదయం అయిందని.. మిగతా వారికి కూడా త్వరలోనే అవుతుందని గులాబీ నేతలు అంటున్నారు.

# బరితెగిస్తున్న లీడర్లు...

నల్గొండ, సెప్టెంబర్ 13, నడుకుంటేనే పని జరుగుతుంది.. వారానికి రెండుసార్లు వస్తే చాలుశీర్షిక చదివి మమ్మల్ని తిట్టుకుంటున్నారు కదూ. మీ స్థానంలో మేము ఉంటే అలాగే తిట్టుకునే వాళ్ళం. కనబడితే రెండు చెంపలు వాయించే వాళ్ళం కూడా. ఎందుకంటే ఆ శీర్షిక అలా ఉంది కాబట్టి. వాస్తవానికి ఈ తరహా భాషను ప్రయోగించాలంటే మాకు కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎందుకంటే మా న్యూస్ వెబ్సైట్ ను అందరూ చూడాలనేదే తాపత్రయం. అంటే తప్ప ఒక సెక్షన్ రీడర్స్ చదవాలనేది కాదు. కాకపోతే జరిగిన దారుణం అటువంటిది. ఇటువంటి దారుణాన్ని వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో ఆ తరహా భాష వాడక తప్పడం లేదు. పెద్ద మనసుతో క్షమిస్తారని కోరుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలని ఏలుతున్న నాయకులు చెబుతుంటారు. పెద్దపెద్ద సమావేశాలు పెట్టి మరి గొప్పగా వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడికి చేరితే అంతకుమించిన ఆనందం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే పథకం అనేది పేదవాళ్లకు చేరినప్పుడు క్రమక్రమంగా పేదరికం తగ్గిపోతుంది. తద్వారా జీవించే హక్కు.. అందరికీ సమానంగా ఉంటుంది. ఒకరి మీద ఆధారపడకుండా స్వశక్తితో బతికే వారి సంఖ్య పెరుగుతుంది. అంతకు మించిన ఆనందం ఇంకెక్కడ ఉంటుంది. పైగా పథకాలను పకడ్బందీగా ప్రభుత్వాలు అమలు చేస్తే.. వాళ్ల అధికారానికి ఇబ్బంది ఉండదు. కానీ మన ప్రభుత్వాలు అలా చేయవు కదా. పథకాల విషయంలో అధికార పార్టీ నేతల నొక్కుడు ఎక్కువగా ఉంటుంది కదా. పైగా అధికార పార్టీ నేతలకు పేటెంట్ రైట్ మాదిరిగా ప్రభుత్వ పథకాలు ఉంటాయి కదా.. పైగా ఇలాంటి వ్యవహారాలలో ఏ వ్యవస్థలు జోక్యం చేసుకోలేవు. జస్ట్ చూస్తూ ఉంటాయి. పేదలకు పథకాలు కావాలి కాబట్టి నేతల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆ అధికార పార్టీలో ఉన్న నాయకులు పేదల అవకాశాన్ని ఆసరాగా చేసుకొని రకరకాల వ్యవహారాలకు పాల్పడుతుంటారు. అయితే తెలంగాణలోని ఓ ప్రాంతంలో ఓ ప్రభుత్వ పథకానికి సంబంధించి ఓ మహిళ అధికార పార్టీ నాయకుడిని కలిసింది. మొదట్లో కచ్చితంగా చేస్తానని హామీ ఇచ్చిన అతడు.. ఆ తర్వాత ఆమెను అనేక పర్యాయాలు తన వద్దకు రప్పించుకున్నాడు. వచ్చిన ప్రతి సందర్భంలో ఆమె అందం అతడిని భూమి మీద నిలువనీయకుండా చేసేది. దీంతో అతడు ఆమె అందాన్ని సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందులో భాగంగానే ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఇక అప్పటినుంచి అసలు కథ మొదలుపెట్టాడు.తన వద్దకు రావాలని.. మల్లెపూలు పెట్టుకోవాలని.. అందంగా తయారు కావాలని.. వారానికి రెండుసార్లు వచ్చిపోతే సరిపోతుందని.. డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ పథకమే కాదు ఇంకా చాలా అందుతాయని ఆఫరించాడు. దీంతో ఆమె భయపడిపోయింది. ఇలాంటిది తప్పని చెప్పింది. అయినప్పటికీ అతడు వినిపించుకోలేదు. దీనికి తోడు మరింత దూకుడుగా వెళ్లడం మొదలుపెట్టాడు.. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఒప్పుకుంది. అయితే అతని బాగోతాన్ని మొత్తం ఫోన్లో రికార్డ్ చేసింది. అది కాస్త సోషల్ మీడియాలోకి ఎక్కడంతో ఒక్కసారిగా సంచలనం నమోదయింది.ఇక్కడ పేర్లు బయట పెట్టవచ్చు. ప్రాంతాలతో సహా వెల్లడించవచ్చు. లీగల్ గా ఇబ్బంది అవుతుంది కాబట్టే ఆ వివరాలు బయట పెట్టడం లేదు. సాధారణంగా అధికార పార్టీ అనగానే కార్యకర్తలకు కొమ్ములు ఉండవు. నాయకులకు పేటెంట్ రైట్స్ ఉండవు. అధికారమనేది కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మారిపోతూ ఉంటుంది. కానీ ఇటువంటి నాయకులు అధికార పార్టీలో ఉంటే మాత్రం అధికారం ఐదేళ్లు కాదు కదా.. ఐదు నిమిషాలు కూడా ఉండదు.

# నల్గొండ జిల్లాలో దాదాపు 40 వేల కుక్కలు

## డాగ్ షో లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ పట్టణంలోని రాంనగర్ పార్క్ లో డాగ్ అడాప్షన్, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్,పలు అంశాల అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ దేశంలో కుక్క కాటుతో ఎంతో మంది చనిపోతున్నారని ఇటీవల వార్తల్లో చూస్తున్నాము. ఈ విషయంపై సుప్రీంకోర్టు సైతం స్పందించింది. నల్గొండ జిల్లాలో సుమారు 40 వేల కుక్కలున్నట్లు అధికారులు అంచనా వేశారు. అమెరికా లాంటి దేశంలో మనుషుల్లాగే కుక్కలకు కూడా విలువ ఇస్తున్నారు . కుక్కలను ఎవరు చంపాల్సిన అవసరం లేదు. పాపం మూట కట్టుకోవద్దు. కుక్కలను దత్తత తీసుకునే కార్యక్రమం మంచి కార్యక్రమం. ఇలాంటి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.

హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద ప్రోగ్రాం నల్గొండలో నిర్వహించాము. డాగ్ అడాప్షన్, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ పై జిల్లా యంత్రాంగం అవేర్నెస్ పెంచాలి. కుక్క కాటుకు గురికాకుండా ఉండేలా,ఒకవేళ గురైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతం చేయాలని అన్నారు.

# దమ్మనపేట రిజర్వ్ ఫారెస్టు లో పంటలను ధ్వంసం చేసిన అధికారులు

మంచిర్యాల దండేపల్లి మండలం లింగాపూర్ బీట్ లోని దమ్మన్నపేట రిజర్వు ఫారెస్ట్ లో గిరిజనులు వేసిన పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేసారు. కవరేజ్ కి వెళ్ళిన మీడియాను ఫారెస్ట్ అధికారులు అనుమతించలేదు. దాంతో జర్నలిస్టులు రోడ్డుపై బైటయించి నిరసన తెలిపారు.

## కరెంట్ ఆఫీస్ సెంటర్ లో విద్యార్థిని రాత్రి దారుణ హత్య



నెల్లూరు బి ఫార్మసీ ఫైన్ ఇయర్ పూర్తయిన మైథిలి ప్రియను నిఖిల్ కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. మాట్లాడాలని కరెంట్ ఆఫీస్ సెంటర్ సమీపంలోని రూముకి పిలిచి, కత్తితో పొడిచి చంపిన స్నేహితుడు ఆపై పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని నెల్లూరు మార్చురీకి తరలించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేసారు. రెండు రోజుల క్రితం గూడూరులో ఓ యువకుడిని అత్యంత దారుణంగా కత్తులతో నరికి చంపిన ఘటన మరొక ముందే నెల్లూరు నగరంలో ఓ యువతిని నమ్మించి అత్యంత కిరాతకంగా పొడిచి చంపిన ఘటన నెల్లూరు జిల్లా ప్రజల్లో తీవ్ర భయాందోళన రేకెత్తిస్తుంది.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని.. రెండేళ్ల కూతురిని చంపేసిన తల్లి





మెదక్ శివ్వంపేట మండలం శభాష్పల్లిలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని భావించిన తల్లి ప్రియుడి కోసం కన్నకూతురినే గొంతునులిమి చంపేసిందో కర్కశ తల్లి. మెదక్ జిల్లా శభాష్పల్లి కి చెందిన మమత కు భాస్కర్ తో వివాహం కాగా పిల్లలు చరణ్ (4), తనుశ్రీ (2) ఉన్నారు. భాస్కర్ తో కలిసి ఉండలేనంటూ పుట్టింటికి వెళ్లిన ఆమెకు ఫయాజ్తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొడుకును తన తల్లి వద్దే వదిలేసి పాపను తీసుకొని ప్రియుడితో వెళ్లిపోయింది. అదేరోజు తనుశ్రీని గొంతునులిమి చంపి గ్రామ శివారులో పాతిపెట్టింది.

# మత మార్పిడి చేస్తున్నారని ఆరోపణ

## టౌన్ ప్లానింగ్ అధికారి ఇంటి ముందు అందోళన

భూపాలపల్లి మతమార్పిడి చేస్తున్నారనే ఆరోపణలతో పలువురు భూపాలపల్లి పట్టణంలోని ఎల్బీనగర్ లో గల మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ ఇంటిముందు ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. భూపాలపల్లి మునిసిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సునీల్, అతడి భార్య 12 మంది విద్యార్థినులను ఇంటికి పిలిపించుకున్నారు. అయితే విద్యార్థులంతా పట్టణంలోని బీసీ, ఎస్సీ హాస్టల్ విద్యార్థినిలు ఉన్నారు. అలాగే కాటారం మండలంలోని గంగారంలోని మోడల్ స్కూల్కు చెందిన వారు ఉన్నారు. వీరిని శుక్రవారం రాత్రి ఇంటికి పిలిపించుకుని ఏసు ప్రార్థనలు చేయిస్తూ మత మార్పిడి చేసేందుకు కుట్ర చేసినట్లు అందులోని ఓ విద్యార్థిని ద్వారా విద్యార్థినిల తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన పోలీసులకు, వార్డెన్లకు సమాచారం అందిం చడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్థానిక ఎస్సై రమేష్ అక్కడికి చేరుకుని స్థానికులు గొడవ చేయకుండా ఆపారు. అలాగే జరిగిన విషయాన్ని తెలుసుకుని పిల్లలను వారి తల్లిదండ్రులకు, వార్డెన్లను అప్పగించి పంపారు. ఈ విషయమై ఎస్సైని వివరణ అడుగగా మోటివేషన్ తరగతుల పేరుతో పిలిచింది వాస్తవమేనని,పూర్తి వివరాలు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

# కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం భక్తుల రద్దీ, ఆధ్యాత్మిక వాతావరణంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. అంజన్న దర్శనానికి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రదర్శనలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, జైపూర్ , నస్పూర్ నుంచి తరలివచ్చిన గిరిజన కళాకారులు చిరుతల భాగవతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రావ్యమైన పాటలు, నృత్యం, తాళనాదాలతో భక్తులను అలరించిన జేశారు. ఆలయ ప్రాంగణమంత శ్రీరామ జయరామ జయజయ రామ, జై హనుమాన్ నినాదాలతో మారుమోగింది. భక్తులు దర్శనంతో పాటు భాగవతాన్ని వీక్షించి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రాచకొండ లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల అరెస్టు



రాచకొండ ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా వెళుతున్న రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు వారి పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. నిన్న చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించిన భూ నిర్వాసితులు.. హైదరాబాద్ – విజయవాడ హైవేపై ధర్నా సైతం నిర్వహించారు. తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి నల్గొండలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున.. ఆయన క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించాలని ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో.. సంస్థాన్ నారాయణపురం పరిధిలోని రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులకు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంస్థాన్ నారాయణపురం మునుగోడు నియోజకవర్గం మీదుగా నల్గొండ వెళ్ళే రూట్ లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.

# విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

## నీరుగారిపోతున్న సమాచార హక్కుచట్టం

## సామాజిక సేవకులు, కర్నే బాబురావు



భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ సంస్థల్లో పారదర్శకతను, ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచడమే ఉద్దేశంగా సమాచారహక్కు చట్టం ప్రభుత్వంరూపొందించిందని, కానీ మణుగూరు మండలంలో విద్యాశాఖ అధికారుల నిర్ల క్ష్యంతో సమాచార హక్కు చట్టం లక్ష్యం నీరు గారిపోతుందని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు బదిలీ అయిన ఆ అధికారుల పేర్లు, మండల విద్యాశాఖ కార్యాలయంలో నేటికీ కనిపిస్తున్నాయని, ప్రస్తుత అధికార పేర్లు లేకుండానే బోర్డులు దర్శనమిస్తున్నాయన్నారు. ప్రజలు సమాచారం కోసం విద్యాశాఖ కార్యాలయానికి వస్తే ఎవరికి దరఖాస్తు అందజేయాల్లో తెలియక అయోమయానికి గురవుతున్నారని, బాబురావు ఆగ్రహం వ్యక్తం చేశారు.స.హ హక్కు చట్టం ప్రకారం అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేసి దానిపై సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు రాయించి ప్రజలకు స్పష్టంగా కనిపిం చేలా ఏర్పాటు చేయాలి. కానీ మండల విద్యాశాఖ అధికారి ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యం గా విద్యార్థులు, ఉపాధ్యాయులకు, ప్రైవేటు విద్యా సంస్థలకు అందుబాటులో ఉండే కార్యాలయంలో అసలు స.హచట్టం బో ర్డు లేకపోవడంతో ఇబ్బందిగా మారిందని




ధ్వజమెత్తారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి స.హ. చట్టం బోర్డులు ఏర్పాటు చేసి సామాన్యులను, ప్రజలను చైతన్యవంతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రేణు అగర్వాల్

## హత్యకేసులో ఇద్దరు అరెస్టు

హైదరాబాద్ కూకట్ పల్లి లో రేణు అగర్వాల్ మర్డర్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఈ నెల పదవ తేదీన కూకట్ పల్లి లోని స్వాన్ లేక్ అపార్ట్మెంట్ లో రేణు అగర్వాల్ అనే మహిళ హత్య కు గురైంది. హర్ష, రోషన్ ఇద్దరు లు కలిసి మర్డర్ చేశారు. ఇద్దరినీ రాంచి లో అదుపులోకి తీసుకున్నాం.నిందుతుల నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

నిందితులు మూడు రోజులుగా ప్లాన్ చేసుకున్నారు. డబ్బులు, బంగారం కోసం మర్డర్ చేశారు. ప్రెషర్ కుక్కర్ తో కొట్టి తర్వాత కట్టేసి గొంతు కోసి చంపారు. హర్ష కు, రోషన్ కు ఇద్దరి కీ ముందు నుంచి పరిచయం ఉంది. రోషన్ స్వాన్ లేక్ అపార్ట్మెంట్ లో అగర్వాల్ ఫ్యామిలీ కీ తెలిసిన వాళ్ళ ఇంట్లో పనిచేసేవాడు. హర్ష డ్రగ్ అడిక్ట్.. గతంలో రోహబిలిటేషన్ సెంటర్ లో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. బైక్ మీద బయటకు వెళ్లి హాఫీజ్ పేట్ లో క్యాబ్ తీసుకొని రాంచి కీ పోయారు. క్యాబ్ డ్రైవర్ సోషల్ మీడియా లో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడని అయన అన్నారు.

# గ్రూప్ వన్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

## తప్పును సరిదిద్దుకోకుండా మరోసారి అప్పీల్ కి వెళ్లాలని ప్రభుత్వం భావించడం సిగ్గుచేటు.

## రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిండు.

## రాహుల్ గాంధీని అశోక్ నగర్ లో కూర్చోబెట్టి హామీ ఇచ్చి మోసం చేసింద్రు

## నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తాం. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తాం.

## మాజీ మంత్రి హరీష్ రావు



సిద్దిపేటలో మెగా జాబ్ మేళా కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు.. పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే బాగుండు మంచి ఉద్యోగం వస్తేనే బాగుండు అని అనుకుంటారు. తప్పులేదు అలా అనుకోవడంలో. కానీ జీవితంలో మొదటి అడుగు పడడం అనేది చాలా ముఖ్యం. నా అనుభవంతో, 25 సంవత్సరాల ప్రజా జీవితంలో గమనించి చెబుతున్న మాట. జీవిత ప్రయాణంలో మొదటి అడుగు పడడమే చాలా ముఖ్యం.. మంచి అని వెయిట్ చేస్తే జీవితంలో లేజీనేస్ పెరిగిపోతుంది. సిద్దిపేట దాటి హైదరాబాదులో ఉద్యోగం చేస్తేనే మీకు అనుభవం వస్తుంది. ఉద్యోగం కోసం మీరు ఊరుదాటి వెళితే మీకు ప్రపంచం అర్థమవుతుంది. పోటీ ప్రపంచంలో నువ్వెక్కడున్నావు, ఎక్కడ నిలబడ్డావు, ముందుకు సాగాలంటే ఏం చేయాలనే విషయాలతో మీ ఆలోచన విధానంలో మార్పు వస్తుంది.

కష్టం యొక్క విలువ తెలుస్తుంది డబ్బు విలువ తెలుస్తుంది. ఉన్నత ఉద్యోగానికి, ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోండి. రాష్ట్రంలో ఈరోజు ఏం జరుగుతుందో మీకు తెలవనిది కాదు.. గ్రూప్ వన్ ఎగ్జామ్ పెడితే నిరుద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు ఫలాన మంత్రులు, ఫలాన అధికారులు లంచం అడిగారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇంత నిర్లక్ష్యంగా పరీక్ష నిర్వహిస్తారా అని స్వయంగా హైకోర్టు ప్రభుత్వంపై మొట్టికాయలు వేసింది. నిజంగా తప్పు చేయకపోతే ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి. అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించాలి.

తప్పును సరిదిద్దకుండా మరో అప్పీల్ కి పోదామని చెప్పడం మూర్ఖత్వం. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. రెండేళ్లు పూర్తకావస్తున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏమయ్యాయి రేవంత్ రెడ్డి? రాహుల్ గాంధీని అశోక్ నగర్ చౌరస్తాలో కూర్చోబెట్టి మాటిచ్చారు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ఏమైంది? ఉద్యోగ నోటిఫికేషన్ వేసింది కేసీఆర్. పరీక్ష నిర్వహించింది కేసీఆర్ గారు. ఇంటర్వ్యూ నిర్వహించింది కేసీఆర్ గారు. కేవలం ఉద్యోగ పత్రాలు ఇచ్చింది మాత్రం రేవంత్ రెడ్డి. అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా ఒక అంశాన్ని బట్టి జాబ్ క్యాలెండర్ అని పారిపోయారు. జాబ్ క్యాలెండర్ కాదు అది జాబ్ లెస్ క్యాలెండర్.. ప్రియాంక గాంధీతో హుస్నాబాద్ సభలో చెప్పించారు.. నిరుద్యోగ యువతకు నాలుగువేల నిరుద్యోగ భృతి ఇస్తామని. ఏమైంది.? ప్రభుతత్వం నిరుద్యోగ యువతని పూర్తిగా మోసం చేసింది. మీ పక్షాన మేము పోరాటం చేసి అసెంబ్లీలో ప్రశ్నిస్తాము. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తాం. సిద్ధిపేటలో జరుగుతున్న ఈ మెగా జాబ్ మేళాతో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోండి. ఉద్యోగం పురుష లక్షణం అనేవారు పాత రోజుల్లో. కానీ ఇప్పుడు ఉద్యోగం మానవ లక్షణం అయింది.. అబ్బాయిల కంటే అమ్మాయిలే అన్ని రంగాల్లో ముందు సాగుతున్నారు. సిద్దిపేటలో ఐటీ టవర్ ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉద్యోగం కల్పించాలనే ఆశయాన్ని ఈ ప్రభుత్వం నిర్వేదం చేసింది. వెటర్నరీ కాలేజ్ ని సిద్దిపేటలో పెడితే రేవంత్ రెడ్డి కొడంగల్ కి తరలించిండు. సిద్దిపేటకు అన్యాయం చేసిండు. వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టించాము. 90% పని పూర్తయింది. ఆ చిన్న పనిని కూడా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఈ ప్రభుత్వం పాజిటివ్ డైరెక్షన్ కంటే నెగటివ్ డైరెక్షన్ లో ఎక్కువ వెళ్తుంది. రాజకీయాలు ఎప్పుడు ఉంటూనే ఉంటాయి. మీ భవిష్యత్తు మాకు ముఖ్యం. మీరు బాగుండాలని అన్నారు.

# స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ విడుదల చేయకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తాం

## యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి




కరీంనగర్ యుఎస్ఎఫ్ఐ కరీంనగర్ నగర కమిటీ సమావేశం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నగర అధ్యక్షులు బుస మణితేజ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ... గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం విద్యారంగంపై సరైన సదస్సు పెట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తామని ఈ సమావేశంలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒకపక్క విద్యార్థులు, యజమాన్యాలు రియంబర్స్మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యాసంస్థలు బంద్ పిలుపునిస్తున్న ప్రభుత్వం పడినట్టు వివరించడంలో ఆంతర ఏమిటని ప్రశ్నించారు రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల విద్యారంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే చర్చలను జరిపి చర్చలు సఫలమయ్యే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వైద్య సిబ్బందిపై దాడి విధుల బహిష్కరణ

అదిలాబాద్ బోథ్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో శుక్రవారం అర్ధ రాత్రి ముగ్గురు వ్యక్తులు వైద్యం కోసం వచ్చి డ్యూటీలో వున్న ముగ్గురు వైద్య సిబ్బంది పై దాడికి దిగారు. దాడికి నిరసనగా వైద్యులు, వైద్య సిబ్బంది విధులను బహిష్కరించారు. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలి, మాకు రక్షణ కల్పించాలంటూ వైద్య సిబ్బందివిధుల బహిష్కరించారు.

# దారిదోపిడి కేసులో ఏడుగురు అరెస్టు

రంగారెడ్డి శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన దారిదోపిడి కేసు ను పోలీసులు ఛేదించారు. దోపిడీకి పాల్పడ్డ ఏడుగురు నిందితులను జడ్చర్ల లో అదుపులోకి తీసుకున్నారు. వ్యాపారి కారు డ్రైవరు మధు నే ప్రధాన సూత్రధారి గా తేల్చారు. 40 లక్షల రూపాయల నగదు తో పారిపోతుండగా కారు పల్టీ కొట్టింది. దాంతో నిందితులు 31. 5 లక్షలను తీసుకుని.. 8.5 లక్షల రూపాయలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. మేడ్చల్ జిల్లా కీసర కు చెందిన స్టీల్ వ్యాపారి రాకేష్ కు వికారాబాద్ లో 40 లక్షల రూపాయలు రావాల్సి ఉండగా, డ్రైవర్ మధు ను తన దగ్గర పనిచేసే వర్కర్ సాయిబాబా నీ వికారాబాద్ పంపాడు. మధు ప్లాన్ ప్రకారం వికారాబాద్ నుంచి డబ్బులు తెస్తుండగా శంకర్ పల్లి పీ ఎస్ పరిధిలో నిందితులు కారును ఢీ కొట్టి డబ్బులు తీసుకెళ్లిపోయారు. కొంత దూరం వచ్చాక నిందుతుల కారు పల్టీ కొట్టింది.. అక్కడి నుంచి మరో కారు లో పారిపోయారు.

# రిమ్స్ ఆసుపత్రి లిఫ్ట్ లో ఇరుక్కున్న పెషెంట్లు

అదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని లిఫ్ట లో పేషంట్లు ఇరుక్కున్నారు. వారిని ఓ వృద్ధురాలు వుంది. అసుపత్రికి వచ్చిన వృద్ధురాలు పై అంతస్థుకు వెళ్తుండగా ఒక్కసారిగా లిపస్టు ఉఆగిపోయింది. దాంతో ఇరుక్కున్న వారు ఆందోళన చెందారు. సెక్యూరిటీ గార్డు, స్థానికుల సహకారంతో క్షేమంగా బయటకు వచ్చారు.

# ఊహించలేని వైద్య విజ్ఞానం మన భారతదేశం సొంతం

## అయుర్వేదాన్ని భావి తరాలకు అందించాలి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ ఆయుర్వేదం.. మన ప్రాచీన వైద్యవిజ్ఞానం మాత్రమే కాదు. భారతీయ జీవన విధానంలో.. వెల్నెస్, ఫిజికల్‌మెంటల్ బ్యాలెన్స్ కు సంబంధించిన కంప్లీట్ ఫిలాసఫీ గా మనం చూడాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

శనివారం అయన జాతీయ అయుర్వేద సదస్సు 2025 లో మాట్లాడారు.

ఈ సందర్భంగా మీకు ఓ విషయం మీకు తెలియచేస్తున్న ఆయుర్వేద వైద్యం తప్ప ఇంటర్ పూర్తయ్యే వరకు కూడా ఆలోపతి టాబ్లెట్ వేసుకొలేదు ఆయుర్వేదానికి ఉన్న గొప్పతనం అది. కానీ ఇటీవల కాలంలో ఆయుర్వేదం కనుమరుగయింది మోదీ ప్రధాని అయినా తర్వాత 2014 తర్వాత ఆయుర్వేదానికి ప్రాధాన్యత పెరిగింది. వేల ఏళ్ల క్రితం ప్రపంచం కనీసం ఊహించలేని వైద్య విజ్ఞానం మన భారతదేశం సొంతం.వేల ఏళ్ల క్రితమే.. ఆపరేషన్లు, కృత్రిమ అవయవాలు, టాక్సికాలజీ, డయాగ్నస్టిక్ టెస్టులు, కాటరాక్ట్ ఆపరేషన్లు చేసిన ఘనమైన చరిత్ర మనది. ఇందుకు మనందరం గర్వపడాలని అన్నారు. చరకుడు, సుశ్రుతుడు, వాగ్భట్టు వంటి ఎందరో మహానుభావులు.. ఈ ప్రాచీన భారత విజ్ఞానం ద్వారా నాటి సమాజానికి వైద్యం చేశారు. చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి గ్రంథాలు.. వైద్యం, ఆపరేషన్లు మొదలైన వాటిలో యావత్ ప్రపపంచానికి మార్గదర్శనం చేశాయి. 'ఫాదర్ ఆఫ్ సర్జరీ' అయిన సుశ్రుతుడు నాటి కాలంలోనే ఆపరేషన్లను చేస్తే.. చరకుడు.. ఫిజియాలజీ గురించి, వివిధ థెరపీల గురించి.. సమస్త మానవాళికి జ్ఞానాన్ని అందించారు. ఇలాంటి మహనీయుల పరిశోధనల ఫలితంగానే.. నాటినుంచి నేటి వరకు వైద్య రంగంలో, చికిత్సా రంగంలో భారతదేశం ఉన్నతమైన స్థానంలో కొనసాగుతోందని అన్నారు.

ఆయుర్వేదం అంటే చెట్లు, మూలికల ద్వారా మందులు ఇవ్వడం మాత్రమే కాదు. యోగా ద్వారా.. శారీరక, మానసిక సమతుల్యతను పంచడం కూడా ఆయుర్వేదమే. ఇవాళ్టి ఈ కాన్ఫరెన్స్ థీమ్ అయిన 'ఏన్షియంట్ ఇన్సైట్స్ – మోడ్రన్ అడ్వాన్స్మెంట్స్' మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆయుర్వేద పునర్వైభవం కోసం జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తోంది.

మీరందరు డాక్టర్స్.. నేను డాక్టర్ను కాబట్టి ఉపాధి కోసం పనిచేయాలని ఆలోచనాలిని పక్కన పెట్టి ఇది మన దేశ సంపద ఇది మన జీవన విధానం భారతీయ వైద్యం అని మన భావితరాలకు దీన్ని అందించాలనే సంకల్పం తో పని చేయాలని అన్నారు.

# బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా డా.వాసుదేవ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



బాపట్ల జిల్లా నూతన కలెక్టర్ గా డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికిన ఇంచార్జి జేసీ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఆర్డీఓ పి.గ్లోరియా, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగాజిల్లా నూతన కలెక్టర్‌ను పలువురు జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

# చందలా పూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించాలి

## ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట ఘన్ పూర్ పంప్ హౌస్ ప్రారంబానికి సిద్ధం చేయాలిగోపులపూర్ కస్తూరి పల్లి చెక్ డ్యామ్ పనులు ప్రారంభించాలి.వచ్చే యాసంగి పంటకు శాశ్వత కాలువల నిర్మాణం చేపట్టాలి. సిద్దిపేట నియోజకవర్గం లో సాగు నీటి పై ఇరిగేషన్ అధికారులతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సమీక్షా.సిద్దిపేట నియోజకవర్గం లో ఈ సారి యాసంగి కి తలెత్తిన సమస్యలు వచ్చే వానకాలం, యాసంగి పంటకు ఉండకుండా చూడాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఈ సారి యాసంగి పంటకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తాయని, అధికారుల సమన్వయం తో తాత్కాలిక కాలువ ఏర్పాటు కావడం వలన కొంత ఇబ్బందులు తొలిగాయని వచ్చే యాసంగి పంట వరకు శాశ్వతంగా కాలువ ఏర్పాటు కావాలని అందుకు ప్రణాళికలు చెపట్టాలన్నారు. ఈ సారి 50వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చామని పెరిగిన ఆయకట్ట దృష్ట్యా ఖీట -7, ఆర్ డి-8, ఆర్ డి-9 కాలువలు త్వరితగతిన పూర్తి చేయాలని రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ అనుసంధానం చేయాలని కోరారు. నియోజకవర్గం లోని పెండింగ్ పనులు, పెండింగ్ కాలువ లు వెంటనే పూర్తి చేయాలాన్నరు..ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని కోరారు, చందలా పూర్ లిఫ్ట్ పనులు వేంటనే ప్రారంభించాలని కోరారు, ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేసి ప్రారంబానికి సిద్ధం చేయాలి. నంగునూర్ మండలం లోని ఘన్ పూర్ గ్రామం వద్ద నిర్మించిన ఘన్ పూర్ పంప్ హౌస్ పనులు చివరి దశలో ఉన్నాయని త్వరితగతి పూర్తి చేసి పంప్ హౌస్ ని అందుబాటులో కి తేవాలని. ఈ పంప్ హౌస్ పూర్థి అవుతే వాగు అవుతలి గ్రామాలకు 3వేల ఎకరాలకు సాగు నిరందుతుందని చెప్పారు. కస్తూరి పల్లి, గోపులా పూర్ చెక్ డ్యామ్ పనులు ప్రారంభం చేయాలని చెప్పారు, సిద్దిపేట నియోజకవర్గం లో పలు గ్రామాల సాగు నీటి సమస్యల అడిగి తెల్సుకున్నారు. రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో ఎస్ఈ సుధకిరణ్, డిఎస్ఈ నాగరాజు, ఈఈ రంగనాయక సాగర్,గోపాల కృష్ణ, ఈఈ రమేష్ అనంతగిరి రిజర్వాయర్, ఈఈ శంకర్ మల్లన్న సాగర్, డిఈ చంద్రశేఖర్, ఏఈఈ ఖాజా పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలకు స్థిరమైన, నిర్దిష్టమైన ఏకాభిప్రాయం ఉండాలి

## రాష్ట్ర రోడ్లు ఽ భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విజయవాడ రాజకీయ పార్టీలకు స్థిరమైన, నిర్దిష్టమైన ఏకాభిప్రాయం ఉండాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఏ ఎండకా గొడుగు కాసే రాజకీయ పార్టీలను ప్రజలు విశ్వసించే రోజులు పోయాయి. యూటర్న్ తీసుకోవడానికి ముందు అమరావతి ప్రజలు, మహిళలు, రైతులకు వైసిపి క్షమాపణ చెప్పాలి. అమరావతిని స్మశానంతో పోల్చిన వైసీపీ.. నేడు ఏ మొహం పెట్టుకుని అమరావతి రాజధాని అంటుందని అన్నారు.

మూడు రాజధానులు పేరిట ఐదేళ్ల కాలాన్ని వృధా చేసినందుకు జగన్మోహన్ రెడ్డి సిగ్గుతో తల దించుకోవాలి. అమరావతి మునిగిపోతుందంటూ దుష్ప్రచారం చేసిన నేతలు.. నేడు సమర్థించడం వెనుక రాజకీయ దురాలోచన ఏమిటి. అధికారం కోసం ఊసరవెల్లిలా రంగులు మార్చే తత్వం వైసిపిది.. ఈ విషయం మరోసారి రుజువైంది. జగన్ తత్వమెరిగి గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నేత నేడు మనసు మార్చుకోవడం వెనుక ఏ కుటిల రాజకీయం ఉందో ప్రజలకు చెప్పాలి. జగన్మోహన్ రెడ్డి తలకిందులుగా తపస్సు చేసిన ప్రజలు వైసీపీని మళ్లీ నమ్మే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విజనరీ చంద్రబాబుతోనే అమరావతి ప్రజా రాజధాని సాధ్యం. వైసీపీని నమ్మి మరోసారి మోసపోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు.

# సబ్ జైల్లో ఉన్న కార్యకర్తలతోమాజీ ఎమ్మెల్యే బొల్లా ములాఖత్



నరసరావుపేట సబ్ జైల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిఎసి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ములాఖాత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైయస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అన్యాయంగా 307 కేసులు నమోదు చేసి, కోర్టు ద్వారా రిమాండ్ విధించటం దారుణం అన్నారు. మా కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం అని అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి గ్రామ వైయస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ శ్రేణులు ఏకతాటిపై నిలిచి తప్పుడు కేసులకు ప్రతిఘటనగా నిలవాలని పిలుపునిచ్చారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రతిచోట టిడిపి అరాచక పాలన కొనసాగిస్తుందని త్వరలోనే ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ తరఫున ఆయన భరోసా కల్పించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మద్దికేర శ్రీ విద్యా సాయి పాఠశాల విద్యార్థులు ఎంపిక విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ వెంకట మాధవ్, ప్రిన్సిపల్ బాల సునీత



మద్దికేర: మండల కేంద్రమైన మద్దికేరలో గల శ్రీ విద్యా సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు.ఈనెల 14 ఆదివారం రోజున కర్నూలులోని గుడ్ షప్పర్డ్ పాఠశాలలో నిర్వహించు 17వ రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు అండర్ 14 విభాగంలో విద్యాసాయి పాఠశాలకు చెందిన బి.వర్షిత,కే.సురేష్ లు ఎంపికైనట్లు పాఠశాల పిఈటి ఇస్మాయిల్ తెలియజేశారు.రాష్ట్రస్థాయి లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 26 నుండి 29 వరకు హైదరాబాదు నందు జరిగే 17వ జాతీయస్థాయి మినీ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని పిఈటి ఇస్మాయిల్ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆదివారం రోజున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్న వర్షిత,సురేష్ లను పాఠశాల కరస్పాండెంట్ వెంకట మాధవ్,ప్రిన్సిపల్ బాల సునీత యాదవ్,పిఈటి ఇస్మాయిల్,పాఠశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు విద్యార్థులకు తెలియజేశారు.

# అపోలో రీచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సెప్సిస్ పై అవగాహన కార్యక్రమం




కరీంనగర్ ప్రపంచ సెప్సిస్ దినోత్సవం సందర్భంగా అపోలో రీచ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ తిరునాధర్ కార్డియో తురాసిక్ ఢ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సంతోష్ దంగేటి మాట్లాడుతూ, సెప్సిస్ ఒక అత్యవసర వైద్య పరిస్థితి అని తెలిపారు. శరీరంలో ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందడం వలన అవయవాలు పని చేయకపోవడం వల్ల ప్రాణాపాయం ఏర్పడుతుందన్నారు. సెప్సిస్ యొక్క ముఖ్య లక్షణాల్లో అధిక జ్వరం, శ్వాసలో ఇబ్బంది, గుండె వేగం పెరగడం, అయోమయం వంటివి ఉంటాయని తెలిపారు. ఎలాంటి ఇన్ఫెక్షన్ వచ్చిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ఎంతో కీలకమని సూచించారు. హాస్పటల్ పరిపాలనాధికారి డాక్టర్ నాగ సతీష్ కుమార్ మాట్లాడుతూ, “సెప్సిస్‌ను సమయానికి గుర్తించి సరైన చికిత్స పొందితే ప్రాణాలను రక్షించవచ్చు” అని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య (మైక్రోబయాలజిస్ట్), డాక్టర్ సునీల్, డాక్టర్ రహీం (క్రిటికల్ కేర్) పాల్గొన్నారు. ప్రజలలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు హాస్పిటల్ తరపున ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించారు.

# జాతీయ లోక్ అదాలత్ అద్భుతం...

## రోడ్డు ప్రమాదం కేసులో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు 88 లక్షల నష్టపరిహారం

విజయవాడ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం పెద్ద ఎత్తున కక్షిదారులు పాల్గొని ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న అనేక కేసులను పరిష్కరించుకున్నారు... ముఖ్యంగా 2020 సంవత్సరంలోనవంబర్ 26వ తేదీన.., చెన్నై విజయవాడ జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలో మార్టేరు వద్ద ..కారు ని లారీ ఢీ కోట్టింది.. ఈ ప్రమాదంలో ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మేరెడ్డి కిరణ్మయి స్పాట్లోనే మృతిచెందగా భర్త మేరెడ్డి వెంకట సాయికుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి.. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ అక్కడే వదిలి పరరయ్యారు.. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు అయితే ఈ కేసును విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావు చాలెంజ్ గా తీసుకొని గత ఐదు సంవత్సరాలుగా పరిష్కారానికి కృషి చేశారు

ఈ సందర్భంలోనే యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రీజనల్ మేనేజర్ ఫణి కుమార్ తో చర్చలు జరిపి మృతురాలు కిరణ్మయి కుటుంబ సభ్యులకు 88 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించేలా కృషి చేశారు.. దీంతో జాతీయ లోక్ అదాలత్ ఈ కేసును న్యాయమూర్తి శేషయ్య పరిష్కరించి బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారానికి సంబంధించిన విషయాలు తెలియజేసి కేసు పరిష్కారానికి కృషి చేసిన న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావును అభినందించారు... కాగా ఇప్పటివరకు జరిగినటువంటి ఏ లోక్ అదాలత్ లో కూడా వెలువడనటువంటి తీర్పును న్యాయమూర్తి శేషయ్య ఇవ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి ఎన్నడూ లేని విధంగా తొలిసారి 88 లక్షల రూపాయలు ఒక ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి బాధిత కుటుంబ సభ్యులకు అందజేసేలా కృషి చేసిన న్యాయవాదిని తోటి లాయర్స్ కూడా అభినందించారు.. ఇదే సందర్భంలో బాధిత కుటుంబ సభ్యులు న్యాయవాది నరసింహారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు... మరోవైపు బాధిత కుటుంబ సభ్యులకు గతంలో ఎన్నడు లేని విధంగా నష్టపరిహారం అందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావు సంతోషం వ్యక్తం చేశారు.. కేసు పరిష్కారంలో సహకరించిన న్యాయవాదులు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# జిల్లాలో పకడ్బందీగా యూరియా పంపిణీ మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలి



డిఏఓ డిసిఓ తహసిల్దార్లు ఎంపీడీవోలు ఎంఏఓలతో యూరియా సరఫరా (పంపిణీ) పై సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్, శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు,వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా సరఫరా పై జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయుటకు ఇప్పటికే వేసుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీలు, తదితర కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో కచ్చితంగా ఉండాలని, రైతులకు వస్తున్న స్టాక్ వివరాలను తెలియపరచి వారిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలను సేకరించి వారికి యూరియాలు సరఫరా చేయాలని,



కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, టెంట్స్, చైర్స్ , సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, యూరియా పంపిణీ విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియా,వివిధ సామాజిక మాధ్యమాలలో యూరియా రాదేమో అని, కొన్నిచోట్ల అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలను మండల స్థాయి లలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే (18) మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, సంఘాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందనీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు,మండల స్థాయి యూరియా పంపిణీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి పక్కాగా యూరియా పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు అదనపు కొనుగోలు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉన్నచోట అదనపు క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బంది ద్వారా రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని, జిల్లాకు రావాల్సిన యూరియా కోట తోపాటు అదనపు యూరియా కోసం రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారుల ద్వారా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.యూరియా సరఫరా అయ్యే వాహనాల యొక్క వివరాలను పక్కాగా సమాచారం తెలుసుకొని నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు,రెవెన్యూ డివిజనల్ అధికారులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు, వ్యవసాయ, సహకార, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, గణేష్, కృష్ణవేణి,వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నవంబర్ 25 నుంచి పౌల్ట్రీ ఈవెంట్

హైదరాబాద్ దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్ ను నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్ లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. వికసిత్ భారత్ దిశగా, స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తుకు దారితీస్తూ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్పో ను “వన్ నేషన్ వన్ ఎక్స్ పో థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ తెలిపారు. నవంబర్ 25న నోవోటెల్ లో నాలెడ్జ్ డే తో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో 1,500కి పైగా ప్రతినిధులు, 7కి పైగా అంతర్జాతీయ నిపుణులు సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో... బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉందన్నారు . మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8 నుంచి 10% వృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.1.35 లక్షల కోట్లకు పైగా తోడ్పటునందిస్తూ ... పోషకాహారం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగావకాశాల పెరుగుదలకు కీలకంగా ఉందని అన్నారు.

# దోచుకోవడం, దాచుకోవడం వైకాపా సిద్ధాంతం

విజయవాడ ఉత్సవ్ పై వైకాపా నేతల విమర్శలు సిగ్గు చేటని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. దసరా ఉత్సవాలు పక్కన పెట్టి విజయవాడ ఉత్సవ్ పై దృష్టి పెట్టారు అని విమర్శలు చేస్తున్నారు. దసరా ఉత్సవాలు అనేక ఏళ్లుగా జరుగుతున్నాయి .. అవి వైభవంగా జరుగుతాయి. దుర్గగుడి అభివృద్ధి టీడీపీ హయంలో జరిగింది. విజయవాడ ఉత్సవ్ పై చిన్ని ఎంపీ ప్రత్యేక దృష్టి పెట్టారు.. విజయవాడ ఉత్సవ్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విజయవాడ వైభవం చూపించటమే ప్రధాన ఉద్దేశం. ఒక అద్భుతమైన ఉత్సవము జరగబోతుంది. మీలాగా దోచుకోవడానికి కాదు, దేవాదాయ శాఖ భూములకు అమౌంట్ కట్టే విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నాం. వైకాపాకు దోచుకోవటం, దాచుకోవడం మీ సిద్ధాంతం. ప్రజల మనస్సు గెలిచి అత్యధిక మెజార్టీ తో ఎంపి గెలిచారని అన్నారు.మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులకు మంత్రులు, అధికారులు జైళ్లకు వెళ్తున్నారు. దేవాదాయ శాఖ భూములు అక్రమంగా దండుకున్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు నీ ఇంటి ముందు ఉన్న గుడిలో వెండి సింహాలు పోయాయి.. వైకాపా అనే వాళ్ళు అవినీతిపరులు. ఎంపీ ఒక అద్భుతమైన పని చేస్తున్నారు. దేశంలోనే ఒక బెస్ట్ నియోజకవర్గం గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. విజయవాడ బిజగ్గయ్యపేట మధ్య డిఫెన్స్ అకాడమీ రాబోతుంది . అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఎంపీ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే మీకు బుద్ధి చెప్తారు . మా నాయకుడు మాకు చాలా క్రమశిక్షణ, పద్ధతిగా మాట్లాడటం నేర్పించారని అన్నారు.

# బియ్యం అందజేత.



కమాన్ పూర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వేల్పుల సాగర్ నాణమ్మ వేల్పుల రాజమ్మ కుటుంబానికి ఐటి శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు 50 కేజీ బియ్యం అందజేయడం జరిగింది. ఆపదలో ఆదుకోవడం మా అందరి ధర్మం అని కాంగ్రెస్ నాయకులు అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మనం రామచంద్ర రావు గారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తోగరీ చంద్రయ్య యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డూరి శ్రీకాంత్ సీనియర్ నాయకులు అడ్డూరి ప్రవీణ్ కుమార్ మరియు ఈర్ల పవన్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## కలిసి ఉంటే కలదు సుఖం,, రాజి మార్గమే ఉత్తమం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి. హెచ్ రమేష్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి.ప్రజాబలం ప్రతినిధి** రాజి మార్గాన్ని ఎంచుకొని వివాదాలు లేని జీవితాలను గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్.రమేష్ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తిగారు మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో పంతాలకు పోయి గొడవలు పెట్టుకుంటే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజి పడి కేసుల్లో నుండి బయటపడాలని జడ్జి గారు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్ మాట్లాడుతూ క్షమా గుణాన్ని కలిగివుండడం గొప్ప విషయం అన్నారు. ప్రతిఒక్కరు సోదరభావంతో మెలగాలని వారు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అడిషనల్ ఎస్.పి. నరేష్ కుమార్, జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, లేబర్ కమిషనర్ వినోద, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, బెంచి మెంబర్లు ఎం.డి. లతీఫ్, అబ్దుల్ కలాం, మంగళపల్లి రాజ్ కుమార్, రావుల రమేష్, కనపర్తి కవిత, మొయినుద్దీన్, సంధ్య, నాగవత్ తిరుమల, పోలీసు అధికారులు పి.కుమార్, ఏ.నరేష్ కుమార్, కర్ణాకర్ రావు, వెంకటేశ్వర్లు బ్యాంకు ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.'

## సమాచారాన్నివ్వకుండా మానేరు డ్యాం నీటిని విడుదల చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి.ప్రజాబలం ప్రతినిధి .** ప్రజలకు, అధికారులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే అలుగునూరు లోయర్ మానేరు డ్యాం పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలి మానేరు తీర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మానేరు డ్యాం గేట్లు ఎత్తడంతో ఒక్కసారి వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలోనే భూపాలపల్లి నియోజకవర్గం టేకుమట్ల మండలం గరిమిళ్లపల్లి – పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్య ఉన్న వాగులో స్థానికులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కొరకు రెవెన్యూ, పోలీసు శాఖల అనుమతితో ఇసుకను ట్రాక్టర్ లలో నింపుకునే క్రమంలో వరదకు ట్రాక్టర్లు కొద్దిదూరం కొట్టుకుపోయాయి. స్థానిక ప్రజలు, టేకుమట్ల పోలీసుల సహాయంతో వాగులో చిక్కుకున్న నలుగురిని ప్రాణాపాయంతో ఒడ్డుకు చేర్చారు. కాగా, నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విషయం తెలుసుకుని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే నిజామాబాద్ పర్యటన ముగించుకుని నేరుగా రాత్రి 8 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను ఎమ్మెల్యే అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. వివిధ ప్రసార మాధ్యమాలల్లో సమాచారం ఇవ్వకుండానే లోయర్ మానేరు డ్యాం పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. కాగా, చాకచక్యంతో వ్యవహరించి వాగులో చిక్కుకున్న నలుగురిని కాపాడిన స్థానికులను, చిట్యాల సీఐ మల్లేష్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

## మంథని ప్రాంత అభివృద్ధి మంత్రి శ్రీధర్ బాబు తోనే సాధ్యం

### -ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పలు అభివృద్ధి పనులు

### -భూమి పూజ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంథని ప్రాంత అభివృద్ధి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తోనే సాధ్యమవుతుందని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో సీసీ రోడ్డు మరియు సైడ్ డ్రైనేజీల కోసంఎస్సీ సబ్ ప్లాన్ నుండి పది లక్షల రూపాయలను రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించగా శనివారం ఈ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేసి మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని మండల అధ్యక్షులు అయిలి ప్రసాద్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, మాజీ సర్పంచ్ కరుణ కృష్ణ, మాజీ వార్డు సభ్యులు ఎరుకల సురేష్ మాట్లాడుతూగత పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించి మన నియోజకవర్గాన్ని, మన గ్రామాలని అభివృద్ధి జరగకుండా చేసిందని గుర్తు చేశారు.మన ప్రజారాజ్యం ఇందిరాగాంధీ రాజ్యం వచ్చాక ఐటీ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా మంథని నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటేనే దుద్దిల కుటుంబం అని వారితోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. పేద ప్రజలకు ఏం అవసరమో చూసి వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. అభివృద్ధి మంత్రి శ్రీధర్ బాబు మరియు శ్రీను బాబు ద్వారానే జరుగుతుందని అన్నారు.ఇక్కడున్న కొందరు నాయకులు వాళ్లు ఏం చేయకున్నా కూడా మేము చేసినమని గొప్పగా చెప్పుకోవడమే తప్ప అభివృద్ధిలో వాళ్లు ఏమి చేసింది లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు రేపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జంజర్ల మల్లేష్, యూత్ అధ్యక్షులు చంద్ర విజయ్, మాజీ సర్పంచ్ ఆకుల కిరణ్, మాజీ ఎంపిటిసి భీముని వెంకటస్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆర్ల నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెద్దపల్లి జిల్లా చైర్మన్ ఆరెల్లి కిరణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జంజర్ల రాజు, జంజర్ల గట్టయ్య, కోరవేణి కృష్ణ, ఆర్ల నారాయణ, ఆర్ల జ్ఞాని, బీసీ సెల్ మంథని మండల అధ్యక్షులు ఆయిలీ శ్రీనివాస్, చెరుకు తోట రమేష్, జంజర్ల చిన్న మల్లయ్య, పార్ల లింగయ్య, రావుల నగేష్, ఆర్ల కార్తీక్, జంజర్ల అమరేందర్, నారమళ్ళ రాజకుమార్, కొండ రాజయ్య, ఆరెల్లి వరుణ్ గౌడ్, ఆర్ల మారుతి, బొద్దుల శ్రీనివాస్, తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



**సెప్టెంబర్ 13, 2025 నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి::** కామారెడ్డి జిల్లాలో ఎస్.సి. కార్పొరేషన్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్న టి. దయానంద్ బదిలీపై నిర్మల్ జిల్లా ఎస్.సి. అభివృద్ధి అధికారి (DSCDOగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు. దయానంద్ కు శుభాకాంక్షలు తెలియజేసిన కలెక్టర్, క్రమశిక్షణతో పనిచేస్తూ, షెడ్యూలు కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, మరింత మందికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## కోర్టు కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం

### రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి




**సెప్టెంబర్ 13, 2025 నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** కోర్టు కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి అన్నారు.

శనివారం జిల్లా కేంద్రంలోని పెంచనర్ల భవనంలో జరిగిన మూడవ జాతీయ లోక్ అదాలత్ సేవల, కమ్యూనిటీ మీడియేషన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా హైకోర్టు న్యాయ మూర్తి మాట్లాడుతూ, కోర్టు కేసుల్లో రాజీ మార్గాల ద్వారా ఇరు వర్గాలకూ న్యాయం చేకూరుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంతో పాటు కక్షిదారులు ప్రశాంతంగా జీవించవచ్చని సూచించారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి సుజన కళాసికం మాట్లాడుతూ, ఏళ్లుగా పెండింగ్లో ఉన్న కేసులకు లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. వరకట్నం, గృహహింస, చెక్ బౌన్స్, రోడ్డు ప్రమాదాలు వంటి కేసులు తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చు అని పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, న్యాయవాదులు ప్రజలకు లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించి, వారిని కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రిమినల్, సివిల్ కేసులు, భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తి గొడవలు తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ సేవలు కోర్టులపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఏళ్లుగా పెండింగ్లో ఉన్న కేసులకు పరిష్కారం చూపుతున్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది కేసులు ఈ విధానం ద్వారా సులభంగా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా కేసులను ఉపసంహరించుకున్న వారికి న్యాయమూర్తులు, కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందనలు తెలిపారు. పలు కేసుల్లో బాధితులకు మంజూరైన నష్టపరిహార చెక్కులు, అటవీ జంతువుల దాడిలో నష్టపోయిన వారికి పరిహార చెక్కులు అందజేశారు. అనంతరం అతిథులను సన్మానించారు.

అంతకుముందు జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులను అటవీ శాఖ వసతి గృహంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూల మొక్కలతో స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు పంచాక్షరి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, ఎస్పీ జానకి షర్మిల, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో ఆదివారం కోడెల పంపిణీ రద్దు.

### జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో 14-09-2025 ఆదివారం కోడెల పంపిణీ కార్యక్రమాన్ని అనివార్య కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా పశు సమర్థక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరూ గమనించాలని సూచించారు. కోడెల పంపిణీ మళ్లీ తదుపరి తేది ఎప్పుడు పంపిణీ చేస్తామని విషయం ప్రకటిస్తామని ఈ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఖమ్మం లో గోయాజ్ అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యూవెలరీ స్టోర్ గోయాజ్ 14వ స్టోర్ ను ప్రారంబించిన అభినేత్రి మిస్ భాగ్యశ్రీబోర్స్





**ఖమ్మం సెప్టెంబర్ 13 (ప్రజాబలం బ్యూరో)** ఖమ్మం భారతదేశంలో అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యూవెలరీ స్టోర్ గోయాజ్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం లో దాని 14వ స్టోర్‌ను అభినేత్రి మిస్. భాగ్యశ్రీ బోర్స్ చేతుల ద్వారా ప్రారంభించబడింది గోయాజ్ సిల్వర్ జ్యూవెలరీ విభాగాన్ని కొత్త రీతిలో నిర్వచిస్తూ దక్షిణ భారతదేశంలో వేగంగా విస్తరిస్తోంది. ఖమ్మం స్టోర్‌ను 13 సెప్టెంబర్ ఉదయం ప్రముఖ నటీమణి మిస్. భాగ్యశ్రీ బోర్స్ ప్రారంభించారు ఈ స్టోర్ లగ్జరీ మరియు సంపదకు ప్రతీకగా ఉంది మీరు ఇక్కడ పొందగల సిల్వర్ జ్యూవెలరీ షాపింగ్ అనుభవం విభిన్నమైనదిగా ఉంటుంది మొత్తం 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడిన ఈ స్టోర్ మీ మనసులో నిలిచిపోయే అందమైన అనుభవాన్ని అందిస్తుంది. మీ లగ్జరీ సిల్వర్ జ్యూవెలరీ షాపింగ్ గమ్యం గోయాజ్ సెప్టెంబర్ 13 నుండి అక్టోబర్ 5 వరకు, అద్భుతమైన ప్రారంభ ఆఫర్లతో మీకు ఆశ్చర్యాన్ని అందిస్తుంది లక్ష విలువైన సిల్వర్ జ్యూవెలరీ కొనుగోలు చేస్తే 50 వేలవిలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యూవెలరీ ఉచితంగా అందుతుంది 50 000 విలువైన సిల్వర్ జ్యూవెలరీ కొనుగోలు చేస్తే 25 000 విలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యూవెలరీ ఉచితంగా అందుతుంది 25 000 విలువైన సిల్వర్ జ్యూవెలరీ కొనుగోలు చేస్తే 12500 విలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యూవెలరీ ఉచితంగా అందుతుంది గోయాజ్ త్వరలో కొత్త మార్కెట్లలో కూడా ప్రవేశించబోతుంది.

గోయాజ్ ను అనుభవించడానికి సిద్ధంగా ఉండండి అని అన్నారు భారతదేశంలోని అతిపెద్ద సిల్వర్ జ్యూవెలరీ బ్రాండ్‌ను అనుభవించింది ఆస్వాదించండి అని కోరారు

## షైన్ హై స్కూల్ లో డి.టి వాక్సిన్ వేసిన ఆరోగ్య సిబ్బంది



ఖమ్మం ప్రతినిది సెప్టెంబర్ 13 (ప్రజాబలం) ఖమ్మం జిల్లా బోనకల్ షైన్ హై స్కూల్ లో బోనకల్ ఆరోగ్య సిబ్బంది డి.టి.వాక్సిన్ వేశారు... ఈ వాక్సిన్ ని పదవ, ఐదవ తరగతి విద్యార్థులకు వేశారు... ఈ వాక్సిన్ వల్ల కొరింత దగ్గు ధనుర్వాతం వంటి రోగాలను అరికట్టవచ్చని సిబ్బంది అన్నారు. ఈస%శీ%దర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ, ఆరోగ్య సిబ్బంది కి ధన్యవాదములు తెలిపారు... ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

## వసతి గృహ విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ అవసరం అల్లాదుర్గం ఎంపీడీవో చంద్రశేఖర్



వసతిగృహం విద్యార్థులతో సమావేశం అయిన ఎంపిడిఒ చంద్రశేఖర్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (సెప్టెంబర్ 13 ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం లోని, అల్లాదుర్గం మండల కేంద్రంలో, వసతి గృహంలో ఉంటూ, విద్యను అభ్యసించుకుంటున్న, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎంపీడీవో చంద్రశేఖర్,సూచించారు, శుక్రవారం అల్లాదుర్గంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహంలో, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్,మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు, మంచి విద్యను అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించుకోవాలన్నారు, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న, వార్డెన్ కిషోర్, ను ఎంపీడీవో, చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు..

## కరెంట్ తీగలకు తగిలే చెట్టు కొమ్మలను దగ్గరుండి తొలగింప చేసిన కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోగల 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ డివిజన్లో కరెంటు తీగలకు ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగినది ఈ కార్యక్రమంలో కరెంట్ లైన్ మెన్ నాగేశ్వరరావు, జవాన్ నాగరాజు, పాషా, నర్సిరెడ్డి, భాస్కర్, బాల, శివరాం, శ్యామల, రాజు, వరికోటి భాస్కర్, విజయలక్ష్మి, కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

## లింగంపల్లి గురుకుల హాస్టల్ సందర్శించిన జిల్లా నాయకులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 13 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మునిపల్లి మండలం లింగంపల్లి, గ్రామంలోని గురుకుల బాలుర హాస్టల్ ను, జిల్లా ఇన్చార్జి బీఎస్పీ, పిప్పాడుపల్లి మోహన్, బీసీ జేఏసీ జిల్లా ఇన్చార్జి, రమేష్ యాదవ్, సందర్శించారు, 40, ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థలో ఉండగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, భోజన విరామ సమయంలో, హాస్టల్ గోడ కూలిపోయింది ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు,, స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనతో విద్యార్థులు తల్లిదండ్రులు, ఆందోళన చెందుతున్నారని వారు వాపోయారు, జిల్లా మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో, ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వారు అన్నారు, విద్యార్థుల బాగోగులపై ప్రభుత్వం సరిగా దృష్టి పెట్టకనే వసతి గృహం కూలిపోయిందని, అన్నారు, ఎంతోమంది పేద విద్యార్థులు, చదువుకొని పై స్థాయికి పోవాలని, తల్లిదండ్రులు ఆశలు పెట్టుకుంటే, ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన, భయం గుప్పెట్లో చదువుకునే పరిస్థితి, ఏర్పడిందన్నారు, వెంటనే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రత్యేక చొరవ తీసుకొని, నూతన భవనాలను వెంటనే నిర్మించాలని వారు ఈ సందర్భంగా కోరారు.....

## మంత్రి వివేక్ ను కలిసిన జి.ఎం ఎన్.రాధాకృష్ణ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 13:**మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామిని మంచిర్యాల క్యాంపు ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేసారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా యొక్క స్థితి గతులను జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ మంత్రి వివేక్ వెంకటస్వామికి వివరించారు.



## జిఎంని సత్కరించిన కాంగ్రెస్ యువ నాయకులు

**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 13**మందమర్రి ఏరియా నూతన జనరల్ మేనేజర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఎన్ . రాధాకృష్ణ కి మందమర్రి పట్టణ కాంగ్రెస్ యువ నాయకులు శనివారం జి. ఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు అర్జున్ కుమార్, ఓరగంటి సురేందర్, శ్రీరామోజు సాయి తేజలు పాల్గొన్నారు.

## సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13 :** సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో డి.సి.పి. ఎ.భాస్కర్ తో కలిసి దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని, దాడులకు పాల్పడకూడదని తెలిపారు.ఈ నెల 12వ తేదీన దండేపల్లి మండలం దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాలలో జరిగిన ఘటనపై దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సామరస్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అటవీ ప్రాంతాలలో కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్మెంట్ క్రింద గిరిజనులు వెదురు పంట సాగుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలలోని గిరిజనులు అటవీ భూములలో వెదురు పంట సాగు చేసేందుకు గుంతలు త్రవ్వడం,మొక్కలకు నీటిని అందించడం, యూరియా ఇతర పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా వెదురు పంటను విక్రయించుకుని ఆదాయం పొందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భౌతిక దాడులకు పాల్పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు,గిరిజనుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్ లో వైభవంగా వైష్ణవానం శ్రీ కృష్ణ జయంతి వేడుకలు

పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యాని కేతన్‌లో శనివారం వైష్ణవానం శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి, శ్రీ కృష్ణుని పూజించి కార్యక్రమా న్ని ప్రారంభించారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి అందమైన అలంకరణ, సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. వేడుకలలో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహపూ ర్వకంగా సందడిగా సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడి బాలలీలలను ప్రతిబింబిస్తూ వినోదాన్ని పంచారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చూపరులను అబ్బురపరిచాయి. కార్యక్ర మానికి హాజరైన గాయత్రి విద్యాసంస్థల కరెస్పాండెంట్ అల్లెంకి రజనీ దేవి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, ప్రేమ, భక్తి వంటి విలువలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని ఆమె అన్నారు.

# పట్లూర్,బాలుర వసతి గృహంలో పేరెంట్స్ మీటింగ్

## వాడన్ తులజ రామ్ గౌడ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 13 ( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి / పట్లూర్ ఎస్సీ బాలుర వసతిగృహం లో ఈరోజు విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగు ఏర్పాటు చేయడం జరిగింది సమావేశంలో విద్యార్థులకు కొన్ని విషయాలు సూచన చేయడం జరిగింది బాల్య దశలో చక్కగా చదువుకోవాలి ఆటపాటల్లో రాణించాలి పట్టుదలతో చదివి ఒక లక్ష్యం చేరాలని తెలిపారు విద్యార్థుల చదువు విషయంలో గురువులు చక్కగా విద్యా బోధన అందిస్తారు తల్లిదండ్రులు పిల్లల్ని పద్ధతిగా బాధ్యతగా విద్యార్థులు విద్య అభ్యాసం చేయాలని తల్లిదండ్రులు కూడా సహకరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు విద్యార్థులకు నోట్ పుస్తకాలు నాలుగు జతల బట్టలు ప్లేట్ గ్లాసు బెడ్ షీట్స్ అందిస్తున్నామని హాస్టల్ వసతిగృహ సంక్షేమ అధికారి తుల్జారామ్ గౌడ్ మాట్లాడుతూ తెలపడం జరిగింది హాస్టల్లో అన్ని వసతులు కల్పించడం జరుగుతుంది అని అన్నారు

# ఆర్ కృష్ణయ్య కు జన్మదిన శుభాకాంక్షలు

## వాడన్,తులజారాం గౌడ్

## జాతీయ కన్వీనర్ ఈశ్వర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 13( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా బీసీ నేత రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జన్మదిన శుభాకాంక్షలు హైదరాబాద్ విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య గారిని బీసీ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు తుల్జారం గౌడ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది బీసీల అభ్యున్నతి కోసం బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం గత 50 సంవత్సరాల నుండి ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేస్తున్న బీసీ నేత ఆర్ కృష్ణయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి బాటలో నడుస్తున్న వారి కుమారులు బిసి ఉద్యమ నేత డాక్టర్ ర్యాగ అరుణ్ గారికి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు శ్రవణ్ బోయిన్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు

## మంచిర్యాల అగ్రి ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం ఎన్నిక



**మంచిర్యాల ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13 :** మంచిర్యాల అగ్రీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం అగ్రి ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మదారీ శ్రీధర్,ప్రధాన కార్యదర్శిగా డి.రాజలింగం, ఉపాధ్యక్షులుగా శ్రావణ్ రెడ్డి,శ్రీనివాస్,రవి,జనార్ధన్, కిరణ్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా కే.శ్రీధర్,జాయింట్ సెక్రటరీగా అత్తె సుధాకర్, అప్పని ప్రదీప్,ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దేవిదాస్,కే ప్రవీణ్,ట్రెజరర్ గా రాజు, రవి,మీడియా కన్వీనర్ గా ఎస్ వేణుగోపాల్, సెక్రెటరీలు గా రమేష్, రాజిరెడ్డి, లక్ష్మణ్,తిరుపతి, సాయి తేజ,సిహెచ్ వేణుగోపాల్,అశోక్, అనుపు రెడ్డి,రంజిత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

## -కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 13** రాష్ట్రంలో వరసకు కురుస్తున్న వర్షాలకు వర్ధ వారిని పడ్డ వరద బారిన పడ్డ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వెంకటస్వామి అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలో రాష్ట్ర కార్మిక గనుల ఉపాధి శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటమునిగిన పట్టణంలోని 19 వ వార్డ్ విద్యానగర్, చెంచు కాలనీ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీ సమీపంలో ఉండే వాగు ఉప్పొంగి వాగు నీరు ఇళ్లలోకి చేరి ఇల్లంతా బురద మయం అయి ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసి ముద్ద య్యాయని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ బాధితులు అధైర్య పడవద్దని త్వరలోనే సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.వరద నీటితో నిత్యవసరాలు కోల్పోయిన బాధితులకు నిత్యవసర సరుకులు అందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నాయకులు ఎండి పాషా, కనకం రామకృష్ణ లను పరామర్శించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మంచికట్ల శంకరయ్య,కోల అరుణ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ టి.రాయలింగు,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, గజ్జెలి లక్ష్మణ్, పుల్లూరి లక్ష్మణ్, మంకు రమేష్, నేరువట్ల శ్రీనివాస్, పైడిమల్ల నర్సింగ్, సోతుకు ఉదయ్, సుకూర్, ఆకారం రమేష్, బండి సదానందం, కనకం రాజు, మాయ తిరుపతి, రాయబారపు కిరణ్, బండి శంకర్ గౌడ్, ఎర్ర రాజు, రాచర్ల గణేష్, చోటే మియా, సురేందర్ లు పాల్గొన్నారు.

# కోనరావుపేట మండలంలో ఖాళీ అవుతున్న బీఆర్ఎస్ పార్టీ.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పావులు కదుపుతున్న ప్రభుత్వ విప్ ఆది.



**కోనరావుపేట, ( ప్రజాబలం ),** కోనరావుపేట మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ, మాజీ ఫ్యాక్స్ చైర్మన్, అబ్బ సాని శంకర్ గౌడ్, మర్రిమడ్ల తాజా మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరినారు. వీరికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పరు. వీరితో పాటుగా కొలనూరు ఫ్యాక్స్ డైరెక్టర్ ఇప్ప రాములు, మాజీ వార్డు సభ్యులు శంకరవ్వ, బొడ్డు కిషన్, సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీలో శనివారం రోజున చేరడం జరిగింది.



ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో దొరల పాలనలో తమకు సరి అయిన గుర్తింపు లేదని, బీసీ బిడ్డ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్న వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పని చేస్తామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు పోతామని తెలిపారు.

# హిందీ భాషా ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి

## ఆర్ సి ఓ సేరు శ్రీధర్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 13 :** హిందీ భాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల,కళాశాలల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్ సి ఓ సేరు శ్రీధర్ తెలిపారు.లక్షెట్టిపేట పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల కళాశాలలో శనివారం ముందస్తుగా హిందీ దివస్ ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమం ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...ప్రతి ఒక్కరికి మాతృభాష తెలుగు ఇంగ్లీష్ తోపాటు హిందీ భాష వస్తే ప్రపంచంలో ఏ చోటనైనా జీవించవచ్చు అన్నారు.హిందీ భాష రాజవాసి అని హిందీ భాషా ప్రచారం కోసం గత రెండు వందల సంవత్సరాల నుండి వ్యోహర్ రాజేంద్ర సింగ్ తోపాటు భారతేందు హరిచంద్ర లాంటి వాళ్ళ కృషి వల్లనే ఈరోజు హిందీ భాష రాజభాషగా రాజ్యాంగం సెప్టెంబర్ 14 1949 సంవత్సరంలో ప్రకటించిందన్నారు.స్వాతంత్రం తీసుకువచ్చే సమయంలో మహాత్మ గాంధీ,నెహ్రూ,పటేల్ తదితరులంతా హిందీ భాషని మాట్లాడే వారిని గుర్తు చేశారు.కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలలో కూడా ప్రతి ఒక్కరు హిందీ భాషను నేర్చుకుంటున్నారని తెలిపారు.పలు వ్యాపార లావాదేవీలు నిమిత్తం ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ భాష రాదు కాబట్టి హిందీ మాట్లాడంతోనే వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయన్నారు.మన ప్రాంత వాసులకు హిందీ ఎక్కువగా మాట్లాడడం వస్తుంది కాబట్టి హిందీకి అంత ప్రాధాన్యత లభించిందన్నారు. అంతేకాకుండా ప్రపంచ దేశాల్లో సైతం హిందీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసి హిందీ భాష ప్రచారం చేస్తున్నారన్నారు. మనం కూడా తప్పకుండా హిందీ భాష నేర్చుకోవాలని తెలిపారు.అనంతరం ప్రిన్సిపల్ మంగ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి హిందీ విద్యను నేర్చుకున్నట్లయితే ఉన్నత స్థాయి విద్య వరకు చాలా ప్రావీణ్యం లభించడంతోపాటు మాట్లాడడం రాయడం సులభంగా వస్తుందన్నారు.ప్రతి ఒక్కరూ జాతీయ భాష అయిన హిందీను కచ్చితంగా నేర్చుకోవాలని సూచించారు.ముందుగా హిందీ ఉపాధ్యాయులు ఆర్సిఓ శ్రీధర్ ప్రిన్సిపల్ మంగ నుశాలువానుతో ఘనంగా సన్మానించారు. హిందీ దివస్ ను పురస్కరించుకొని వ్యాసరచన ఉపన్యాస పాటలు నృత్య పోటీలు ఏర్పాటు చేయగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతి క కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.హిందీ ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్,శైలజలను ప్రిన్సిపల్ ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ తిరుమల్ తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 13:**మందమర్రి పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నిత్యావసర సరుకులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నిత్యా అవసర సరుకులు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్షంతో నిత్యావసర సరుకులు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వర్షాల మూలంగా ఇళ్లు కోల్పోయిన వారిని గుర్తించి వారికి త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి, గోపికృష్ణ, శ్యాంబాబు, కాంగ్రెస్ నాయకులు మంకు రమేష్, గజ్జెలి లక్ష్మణ్, సోతుకు రాజయ్య, మాయ తిరుపతి, సోతుకు ఉదయ్, జంగంపల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు.

**వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ ( వీ.టి.డి.ఏ ) ఆధ్వర్యంలో ప్రధాన ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం.**

**సులభ దర్శనం – మెరుగైన వసతులు ప్రజా ప్రభుత్వం పక్క ప్రణాళికతో కృషి.**

**మొదటి దశలో 111 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ పనులు.**

**35.25 కోట్లతో అన్నదాన సత్ర భవనం నిర్మాణ పనులు ప్రారంభం.**

**ప్రభుత్వ విప్ ఆది, ప్రత్యేక చొరవతో 47.86 కోట్లతో 80 ఫీట్ల ఆలయ రోడ్డు విస్తరణ పనులు.**

**సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు.**

**2027 నాటికి ఆలయ అన్ని దశల పనులు పూర్తి చేయడమే లక్ష్యం.**

**వేములవాడలో తీరనున్న ట్రాఫిక్ సమస్య, భక్తులకు అందుబాటులోకి రానున్న అన్ని వసతులు.**



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** రాజన్న భక్తులకు సులభంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించే పనులకు శ్రీకారం చుట్టింది ప్రజా ప్రభుత్వం. వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ ( వీ.టీ.డీ.ఏ) ఆధ్వర్యంలో ప్రధాన ఆలయ విస్తరణ, అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పక్క ప్రణాళికలు సిద్ధం చేసింది. వేములవాడ మూల వాగు నుంచి ప్రధాన ఆలయం వరకు బ్రిడ్జి, రహదారి నిర్మాణం పనులు మొదలయ్యాయి. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అన్ని నిర్మాణాలను ఆగమ శాస్త్రానుసారంగా పనులు చేపడుతూ భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు సర్వసిద్ధమవుతుంది.

వేములవాడ అభివృద్ధి ప్రణాళిక ఏకపక్షంగా కాకుండా, విస్తృత చర్చల అనంతరం ఖరారైంది. శృంగేరి పీఠాధిపతి ఆశీర్వాదం, పండితులు, ప్రముఖులు, పట్టణ పెద్దల సూచనలు, స్థానిక ప్రజల అభిప్రాయాలు, మీడియా వర్గాల సూచనలతో తుది రూపు దాల్చింది. ఆలయ నిర్మాణ డిజైన్లు ఇటీవల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

మార్గం సుగమం.

వేములవాడలో ఎన్నో దశాబ్దాల కల నెరవేరనున్నది. మూల వాగు నుంచి శ్రీ రాజరాజేశ్వర ఆలయం వరకు ఇప్పుడు ఉన్న 40 ఫీట్ల రోడ్డు స్థానంలో 80 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 47 కోట్ల 86 లక్షల రూపాయలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు వీ.టీ.డీ.ఏ వైస్ చైర్మన్,%ఢ% కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రత్యేక చొరవతో రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కులు అందజేసిన తర్వాత కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. అలాగే మూల వాగు వద్ద స్థలాలు సేకరించి ఆ పనులు వేగంగా చేపట్టేలా కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. రూపాయలు ఆరు కోట్ల యాభై ఆరు లక్షలతో ప్రస్తుత బ్రిడ్జి పనులు మొదలయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు వేములవాడ పట్టణ వాసుల ట్రాఫిక్ కష్టాలు దూరం కానున్నాయి.

ఆకర్షణీయంగా మహా మండపం, గోపురాలు.

మొదటి దశలోనే 111 కోట్ల రూపాయల వ్యయంతో మహా మండపం, నిత్య కళ్యాణమండపం, ధర్మగుండం పునరుద్ధరణ, కొత్త రాజ గోపురాలు ఆకర్షణీయంగా నిర్మించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యాత్రికుల సౌకర్యార్థం విశాల ప్రాకారాలు, ప్రత్యేక క్యూ లైన్లు కూడా సిద్ధమవుతున్నాయి. రాబోయే దశలో గుడి చెరువు ఘాట్ అభివృద్ధి, బండ్ సుందరీకరణ,( బ్యూటిఫికేషన్ ), మల్టీ లెవెల్ పార్కింగ్, వాహనాల కోసం విస్తృత స్థలాలు కూడా అభివృద్ధి కానున్నాయి. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ లు, హెల్ప్ డెస్క్, సాంస్కృతిక వేదికలు ఏర్పాటు కానున్నాయి. ఆలయం వద్ద 25 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పించేందుకు వీలుకానున్నది.

ఒకేసారి వెయ్యి మంది భోజనం చేసేలా...

రూపాయలు 35.25 కోట్లతో అన్నదాన సత్ర భవనం నిర్మాణం జరుగుతుంది. ఒకేసారి 1000 మంది భోజనం చేసే డైనింగ్ హాల్,600 మందికి వెయిటింగ్ హాల్, లడ్డు తయారీ కేంద్రం, ఆధునిక వంటశాలలు అందించగల సామర్థ్యం కలగనుంది.

కొత్త నిర్మాణాలకు..

వేములవాడ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పాత కట్టడాల కూల్చివేత, కొత్త నిర్మాణాలకు స్థలం సిద్ధం చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే భారీ యంత్రాలతో పాత గోడలు, నిర్మాణాలను తొలగించి శుభ్రపరిచే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టు కింద 150 కోట్ల వెయ్యద్దు రహదారుల విస్తరణ, రూపాయలు 3.40 కోట్లతో భూ సేకరణ, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.

భీమేశ్వర ఆలయంలో పనులు..

శ్రీ బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు, 10 కోట్ల నిధులతో శరవేగంగా కొనసాగుతున్నాయి. 12 కోట్ల రూపాయల నిధులతో గుడి చెరువులో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. రాజన్న ప్రధాన ఆలయంలో స్వామి వారికి నిత్య పూజలు యధావిధిగా కొనసాగుతాయి. శ్రీ భీమేశ్వర ఆలయంలో మూడు కోట్ల 44 లక్షలతో కళ్యాణమండపం, హోమ, వ్రత మంటపం, షెడ్ నిర్మాణం, క్యూలైన్లు, సిసి ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయి.

రాజన్న కోడెల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి.

వేములవాడ రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడె మొక్కు, కోడెల సంరక్షణకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గోశాలలో సిసి ఫ్లోరింగ్, షెడ్లు నిర్మింప చేశారు. ఇతర పారిశుద్ధ్య పనులు నిత్యం చేయిస్తున్నారు. ఇప్పటిదాకా చిన్న సన్నకారు రైతులకు మొత్తం వేల కోడెలను పంపిణీ చేయించారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పశువైద్య సిబ్బందిని నియమించారు. కోడెలకు నిత్యం పచ్చిగడ్డి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గోశాలలోని జీవాలకు పచ్చి గడ్డి సమస్య పరిష్కారానికి పచ్చి గడ్డి పెంచేందుకు చర్యలు ప్రారంభించడం జరిగింది. జీవాలకు నిత్యం పచ్చి గడ్డి అందుబాటులో ఉంటుంది.

ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక పర్యవేక్షణ.

వేములవాడ ఆలయ అభివృద్ధిపై మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య ర్, వీటీడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. రహదారులు, డ్రైనేజీ, భూ సేకరణ, భద్రతా చర్యలపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వేములవాడ పట్టణం, శ్రీ రాజరాజేశ్వర ఆలయం అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక గమ్యస్థానంగా అవతరించనుంది.

ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు.

వేములవాడను టెంపుల్ సిటీగా మార్చడమే లక్ష్యం.

ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్.

ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక వేములవాడను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు భారీగా నిధులు మంజూరు చేస్తున్నది. శృంగేరి పిఠాధిపతులు, వాస్తు పండితులు, ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు రాజన్న ఆలయాన్ని విస్తరిస్తున్నాం. భక్తులకు సులభంగా, వేగంగా దర్శనం కల్పిస్తాం, ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు.

ప్రణాళిక ప్రకారం పనులు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వీటీడీఏ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం గడువులోగా పనులు పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. ఆలయ విస్తరణ, రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తున్న వేములవాడ పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, వీ టి డి ఏ వైస్ చైర్మన్.

## ఉత్తర తెలంగాణ జిల్లాలలో బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో సభ్యత్వ నమోదు ప్రారంభం.

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీసీ సభ్యత నమోదుకు, గ్రామాలలో ఈ నెల ఆఖరున, గ్రామ కమిటీలను పూర్తి చేయాలని, మండల కమిటీలకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

పటిష్టవంతమైన కమిటీల నేతృత్వంలో బీసీ హక్కుల సాధనకై, తెలంగాణ ఉద్యమంలో మరో బీసీ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసిపడేలా ఉద్యమిస్తామని, ఉత్తర తెలంగాణలో బీసీ సభ్యతలను చేపట్టి, బీసీ పోరాటాన్ని, రిజర్వేషన్లు, ఆర్థిక అధికారం కై పోరాటం కాకుండా బీసీలు ఆత్మ అభిమాన పోరాటంగా కొనసాగిస్తామన్నారు. బీసీ హక్కుల సాధనకై కుల సంఘాలు, ఉద్యమం బలపడుటకై, పటిష్టవంతంకై, బీసీ సభ్యత్వ నమోదు గ్రామ కమిటీలు ఏర్పాటు అనివార్యం అని అన్నారు.

ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కుల గణన సర్వేలో బీసీలు 56.3 శాతం ఉన్నారని అధికారం గా తేల్చినందున, బీసీ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి, ఉద్యోగపరంగా వివిధ రంగాలలో వాటా కల్పించుటకై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరుతూ ఉద్యమ సాధనకై బీసీ సంఘాలు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు శక్తివంతంగా ఉండుటకు గాను ఈ నెల చివరి వరకు గ్రామస్థాయిలో బీసీ సాధికారిత సంఘం పక్షాన కమిటీలను ఏర్పాటుచేసి, అక్టోబర్ నెలలో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని పొలాస నరేందర్ తెలిపారు.

మొదటి విడతలో నియోజకవర్గానికి 1000 మంది చొప్పున, ఉత్తర తెలంగాణ జిల్లాలలో 50వేల సభ్యత్వాలను నమోదు చేయించే కార్యక్రమాన్ని చేపట్టనున్నమని, మొదటి విడుత పూర్తయ్యాక, రెండవ విడతలో 50,000, మూడవ విడతలో మరో 50 వేల సభ్యతలను నమోదు చేయించబడునని, పొలాస నరేందర్ తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటుగా, రాష్ట్రంలో బీసీ సాధికారిత సంఘం బలోపేతంకై సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని నరేందర్ అన్నారు.

అంతేకాకుండా గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు చేసిన హామీలు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని, చట్టబద్ధంగా బీసీలకు సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదు సంవత్సరాల కు లక్ష కోట్ల రూపాయలు కేటాయిస్తామని, అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో బీసీ ఐక్యత భవనాల ఏర్పాటు, బీసీ ఫెడరేషన్ లను ఆర్థిక కార్పొరేషన్లుగా మారుస్తామని, కులాలవారీగా ఆర్థిక కార్పొరేషన్ను ఏర్పాటు చేసి వాటికి సరిపడా నిధులను కేటాయింపు చేస్తామని, మహాత్మ జ్యోతిబాపూలే బీసీ విదేశీ విద్యా నిధి పథకం, బీసీ కోటను పెంచుతామని, రాజీవ్ యువ వికాసం పథకం అమలు, విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల నిధుల విడుదల చేస్తామని ఇచ్చిన హామీలను సాధించుకొనుటకై సభ్యత నమోదు, గ్రామ కమిటీల ఏర్పాటు అనివార్యమని నరేందర్ పేర్కొన్నారు.

అంతేకాకుండా చట్టసభలో బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని కోరుతూ, బీసీ ఉద్యమ సాధనకై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీసీ సభ్యత నమోదు, బీసీ కమిటీలు ప్రతిష్టవంతంగా ఉండుటకు గాను, ఇట్టి సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని నరేందర్ తెలిపారు.

## వేములవాడ రాజన్నను దర్శించుకున్న సినీ నటుడు సత్యం రాజేష్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం రోజున సినీ నటుడు సత్యం రాజేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు ఆయనను ఆశీర్వదించి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ఘనంగా నివాళులు.



**బోయినపల్లి, ( ప్రజాబలం),** శనివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ గ్రామంలో కామ్రేడ్ జోగినపల్లి ఆనందరావు కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూసం రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, కామ్రేడ్ జోగినపల్లి ఆనందరావు, బద్దం ఎల్లారెడ్డి, చిట్యాల ఐలమ్మ, సింగిరెడ్డి భూపతిరెడ్డి, కర్రోళ్ల నరసయ్య, ఇలా ఎంతో మంది యోధులు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, దోపిడికి వ్యతిరేకంగా, అంటరానితనానికి వ్యతిరేకంగా, కుల వివక్షకు వ్యతిరేకంగా, ఇలా అనేక పోరాటాలు చేసే పేద ప్రజలకు అండగా నిలబడ్డ కమ్యూనిస్టు యోధులు, కానీ నేటి రోజున బిజెపి, లాంటి వాళ్లు చరిత్రను వక్రీకరించి, హిందూ, ముస్లిం పంచాయతీగా చిత్రీకరిస్తూ తెలంగాణలో రాజకీయ అధికారము పొందాలని యువతను, చరిత్రను తప్పుదారి పట్టిస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వారసులు కమ్యూనిస్టులు అని సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి మూసం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కోడం రమణ, జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు గురజాల శ్రీధర్, సూరం పద్మ, జిల్లా సిపిఎం పార్టీ నాయకులు రామంచ అశోక్, గీసా బిక్షపతి, సంఘం దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయానికి వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి.

### ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో కలిసి శనివారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత చర్యలు పటిష్టం చేయాలని, వివిధ ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో క్యూలైన్స్, వీఐపీ దర్శనం, కోడె మొక్కుల దర్శనం, వీఐపీ రోడ్డు, పార్కింగ్ స్థలాలు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి భక్తుల రాకపోకలు సాఫీగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణం సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ ఎస్ ఐ రాజు, రాజన్న ఆలయ ఈఈ రాజేష్, డి ఈ మహిపాల్ రెడ్డి, ఏ ఈ ఓ శ్రావణ్ కుమార్, ఏ ఈ నాగరాజ్, ఆలయ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com